

పక్షుల పండుగ రెండవరోజు ఆదివారం అదరహో అనిపించింది.. సూళ్లూరుపేట కళాశాల మైదానప్రాంతాలు, నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం, భీములవారిపాళెం పడవలరేవు, అటకానితిప్ప ప్రాంతాలకు జనం తండోపతండాలుగా తరలివచ్చారు. ఇక సూళ్లూరుపేట కాలేజీ మైదానంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను చూసేందుకు కూడా జనం పోటీపడ్డారు. ఉద్యానవనశాఖ, షార్ కేంద్రం ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో జనం సందడి కన్పించింది. బీవీపాళెం పడవలరేవు, అటకానితిప్పల్లో ఏర్పాటు చేసిన వేదికల వద్ద నృత్య ప్రదర్శనలు పర్యాటకులను ఆకట్టుకున్నాయి. బంగారు చీరలో ఉన్న సూళ్లూరుపేట చెంగాళమ్మను దర్శించుకునేందుకు బారులు తీరారు.

- సూళ్లూరుపేట/తడ, (ఆంధ్రజ్యోతి)

బీవీపాలెం ఓడ రేవు వద్ద బోటు షికారు కోసం వచ్చిన సందర్శకులు



- పోటెత్తిన జనం
- పడవ షికారుకు ఉత్సాహం
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- భారీ వర్షంతో ఇక్కట్లు

పక్షుల పండుగ
అదరహో!

వానతో అవస్థలు

శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు వాన కురిసింది. దీంతో కళాశాల మైదానంలో నీళ్లు నిలబడిపోయాయి. ఆ ప్రాంతం బురదగా మారడంతో నీళ్లను మోటార్లు పెట్టి బయటకు తోడేందుకు శ్రమించాల్సివచ్చింది. భీములవారిపాళెం పడవలరేవు వద్ద కూడా వానకు చిత్తడిగా మారిపోవడంతో అక్కడ సైతం జనం ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

జోరుగా హుషారుగా పడవ షికారు

భీములవారిపాళెం వద్ద ఏర్పాటు చేసినపడవ షికారుకు జనం ఎగబడ్డారు. వానజల్లు ఉన్నా ఉదయం నుంచే జనం పెద్ద ఎత్తున తరలివచ్చారు. భద్రత రీత్యా ఒక్కో పడవలో 10 మందికి మించి జనాన్ని ఎక్కించకపోవడంతో పడవ షికారుకు గంటపాటు ఎదురుచూసే పరిస్థితి నెలకొంది.

వచ్చే ఏడాది మరింత ఘనంగా పండుగ : జేసీ

దొరవారిసత్రం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది కూడా ఇదే నెలలో ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహిస్తామని తిరుపతి జిల్లా జేసీ శుభం బన్సల్ తెలిపారు. పక్షుల పండుగ నిర్వహణపై అనుభవం ఉన్న అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో మరింత ఘనంగా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఆదివారం నేలపట్టు పక్షుల కేంద్రంలో పర్యటించిన ఆయన తహసీల్దారు శైలాకుమారి, ఎఫ్‌ఆర్‌వె సౌజన్యలతో ఏర్పాట్లపై చర్చించారు. తిరుమల ఘటనతో ఫ్లెమింగో ఫెస్టివల్ ఏర్పాట్లల్లో కొంత జాప్యం జరిగిందని, ఈ ఏడాది లోటుపాట్లను గుర్తించి, వచ్చే ఏడాదికి ముందుగానే సిద్ధం అవుతామని మీడియాకు వివరించారు.

రెండు గంటలు అవస్థలు

దొరవారిసత్రం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): నేలపట్టు పక్షుల కేంద్రంలో ట్రాఫిక్ అంతరాయంతో సందర్శకులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఆదివారం సెలవు దినం కావడంతో పెద్ద సంఖ్యలో కార్లలో వచ్చారు. దొరవారిసత్రం నుండి పక్షుల కేంద్రం ప్రధాన గేటు వరకు మధ్యాహ్నం సమయంలో రెండు గంటల పాటు వాహనాలు ఆగిపోయాయి. హైవే వంతెన, రైల్వే వంతెనల వద్ద వాహనాలు ఇరుక్కుపోయాయి. దాంతో నేలపట్టు ఆర్ అండ్‌బి రోడ్డుపై కూడ వాహనాలు బారులు తీరి కదలకుండా నిలబడిపోయాయి. పోలీసులు జోక్యం చేసికుని పరిస్థితిని చక్కదిద్దారు.

పక్షులతో పోటీపడి...

దొరవారిసత్రం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఫ్లెమింగో ఫెస్టివల్ రెండవ రోజు నేలపట్టు సందర్శకుల రద్దీతో సందడిగా కనిపించింది. చెరువులోని కడపచెట్లమీద పక్షులతో పోటీపడి చెరువు కట్టమీద సందర్శకులు కిటకిటలాడారు. ఉదయం చిరు జల్లుల వల్ల జనం పలుచగా కనిపించినా 11 తర్వాత వెల్లువలా వచ్చారు. పక్షుల కేంద్రంలోని అన్నీ రోడ్లు జనంతో నిండి పోయాయి. సెలవురోజు కావడంతో చెన్నై నుంచి ఉద్యోగుల కుటుంబాలు పెద్ద సంఖ్యలో వచ్చాయి. అలాగే శ్రీసిటీ, మేనకూరు, మాంబట్టు సెజ్‌ల్లోని పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు కూడా భారీగానే వచ్చారు. నెల్లూరు, గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట, సత్యవేడు, వరదయ్యపాళెం, ఆరంబాకం, గుమ్మిడిపూడి ప్రాంతాల నుండి సందర్శకులు అధిక సంఖ్యలో వచ్చారు. ఆదివారం ఒక్కరోజే దాదాపు 10 వేలమంది నేలపట్టును సందర్శించినట్లు అంచనా.

హైలెస్సో.. హైలెస్సా

వరదయ్యపాళెం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తడ మండలం భీములవారిపాలెం ఓడ రేవు నుంచి రెండో రోజూ సందర్శకులు పడవ షికారు చేశారు. 1.55 కిలోమీటర్ల మేర పడవ షికారు చేశారు. ఇక, కలెక్టర్ వెంకటేశ్వర్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కూడా బోటు షికారు చేశారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థులు ఎంతో మానసికోల్లాసంతో గడుపుతారన్నారు.



సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న యాంకర్ అనసూయ



సూళ్లూరుపేటలో ఏర్పాటు చేసిన స్టాళ్ల వద్ద జన సందోహం

పర్యావరణం.. అభివృద్ధి

'పులికాట్ సరస్సుకు పర్యావరణం అతి ముఖ్యమైన అంశం. పక్షులు పెద్ద ఎత్తున వస్తాయి. అదే సమయంలో అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఎన్నో దేశాల నుంచి వచ్చే పక్షులను కాపాడుకుంటేనే ఇలాంటి పండుగలు జరుపుకోగలం'

- కలెక్టర్ వెంకటేశ్వర్

నేటి నుంచి కుష్ఠు వ్యాధిపై సర్వే

- ఫిబ్రవరి 2 వరకు నిర్వహణ
- జిల్లాలో 1,875 బృందాల ఏర్పాటు

నెల్లూరు (వైద్యం) జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కుష్ఠు వ్యాధిగ్రస్థులను గుర్తించేందుకు సోమవారం (నేటి) నుంచి ప్రత్యేక సర్వే నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 2 వరకు ఈ సర్వే జరుగుతుంది. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్ ఇంటింటికి తిరిగి ఎవరైనా వ్యాధిగ్రస్థులు ఉన్నారా.. ఉంటే వారు ఎలాంటి చికిత్స పొందుతున్నారు.. అసలు చికిత్స చేయించుకుంటున్నారా.. లేదా...? అనే వివరాలు సేకరించనున్నారు. ఒంటిపై రెండుకిమించి మచ్చలు ఉన్నట్లయితే.. కుష్ఠువ్యాధిగా అనుమానించి స్థానిక పీహెచ్‌సీల్లో పూర్తి స్థాయి పరీక్షలు చేసేలా విధానాలు రూపొందించారు. అంతే కాక వారి వివరాలు నమోదు చేసుకుని, ప్రత్యేక చికిత్స చేయించుకునేలా చేయూత నిస్తారు. ఇందుకుగాను కేంద్ర కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకు జిల్లాలో 1,034 మంది కుష్ఠు వ్యాధిగ్రస్థులు ఉన్నారు. వారికి అన్ని విధాలా చికిత్స అందిస్తున్నారు. మొత్తం వ్యాధిగ్రస్థుల్లో 490 మంది దివ్యాంగులు ఉన్నట్లు అధికారులు నిర్ధారించి పింఛను అందిస్తున్నారు. అలాగే వారికి వాకర్లు, ఊతకర్రలు అందిస్తున్నారు. అవసరమైనవారికి శస్త్రచికిత్సలు కూడా అందిస్తున్నారు. గత ఏడాది కాలంలో 30 మందికి శస్త్రచికిత్సలు నిర్వహించారు.జిల్లాలో ఇంటింటి సర్వేలో 1,875 బృందాలు పాల్గొంటున్నాయి. ఒక్కో బృందంలో ఏఎన్ఎంతో పాటు ఆశా కార్యకర్త ఉంటారు. సర్వేపై పీహెచ్‌సీ వైద్యుల పర్యవేక్షణ ఉంటుంది. ఈ సర్వేలో కొత్త కేసులను గుర్తించటమే కాకుండా కుష్ఠువ్యాధిపై అవగాహన కలిగించనున్నారు.

- వరుస తెగుళ్లతో దెబ్బతిన్న మినుము పైరు
- అధిక వ్యయం భరించి మందుల పిచికారి
- అయినా అదుపు కాని చీడపీడలు
- బూజుపట్టిన కాయలు, గింజలు
- ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతుల డిమాండ్



ముసురుతో దెబ్బతిన్న మినుము పైరు

ముంచిన ముసురు

చేజర్ల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వాతావరణ ప్రతికూల పరిస్థితులు మినుము రైతులకు చేదు అనుభవాలు మిగుల్చాయి. పంట చేతికందే తరుణంలో వారిని ముసురు ముంచేసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా కోతకు వచ్చిన మినపకాయలు బూజు పట్టడంతోపాటు, నూర్పిడి తర్వాత మినుములు రంగు మారడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తెగుళ్ల బెడద

జిల్లాలోని మెట్టప్రాంత రైతులు ఎక్కువగా మినుము సాగు చేశారు. గత ఏడాది మినుము రైతులకు ఆశించిన స్థాయిలో లాభాలు రావడంతో ఈసారి అధికంగా సాగు చేశారు. చేజర్ల మండలంలో ఈ సారి ఏడు వందల ఎకరాలకుపైగా మినుము సాగు చేశారు. మొదట్లో ఆశాజనకంగా ఉన్న పైరు, వచ్చేకొద్దీ ముసురు పట్టడంతో తెగుళ్ల తీవ్రత ఎక్కువైంది. దీంతో రైతులు అధిక ధరలు వెచ్చించి పురుగు మందులు కొనుగోలు చేసి పిచికారి చేశారు. అయినా కానీ తెగుళ్లు అదుపులోకి రాలేదు. అంతలోనే పంట చేతికొచ్చేయడంతో కొంతమంది రైతులు పంట కోతకు అయ్యే ఖర్చులు కూడా మళ్లీ అదనపు భారం అవుతాయని పంటను పొలాల మీదే వదిలేశారు. మరి కొంతమంది రైతులు పశువుల మేతగా ఉపయోగించారు. ఈ క్రమంలో అప్పు చేసి సాగు చేసిన రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. కౌలు రైతులకు కన్నీరే మిగిలింది. ఎకరాకు సుమారు రూ. 30 వేల నుంచి రూ. 35 వేల వరకు ఖర్చు కాగా, రూ.10 వేలు కూడా వచ్చే పరిస్థితి కానరాలేదు.



బూజు పట్టిన మినుములు

అధికారుల పరిశీలన

ఈ క్రమంలో వ్యవసాయాధికారులు పలు మార్లు పైరును పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదించామని చెబుతున్నారే తప్ప తదుపరి చర్యలు ఏమిటన్నది చెప్పడం లేదని రైతులు వాపోతున్నారు. చేజర్ల మండలమే కాకుండా పొదలకూరు, కలువాయి, ఏఎస్‌పేట, అనంతసాగరం మండలాలలోని రైతులు కూడా మినుము సాగుచేశారు. అయితే ఏఎస్ పేట మండలంలో మాత్రమే పంట కోత ప్రయోగంలో తక్కువ దిగుబడి వచ్చినట్లు, అక్కడ మాత్రమే పంట నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

పరిహారం అందచేయాలి



ప్రస్తుతం మినుము పైరు నూర్పిళ్లు జరుగుతున్నాయి. అయితే పూర్తిగా రంగు మారిన మినుములను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. గతం లో ఎకరాకు ఆరు బస్తాల నుంచి పది బస్తాలు దిగుబడి వచ్చేవి. ప్రస్తుతం బస్తా నుంచి రెండు బస్తాలు మాత్రమే వస్తున్నాయి. పూర్తిగా దిగుబడి తగ్గిన నేపథ్యంలో రైతులకు ఇన్సూరెన్స్ పరిహారం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి

- నెట్టెం వెంకటకృష్ణ చౌదరి, రైతు, చిత్తలూరు

కౌలురైతులకు పరిహారం ఇవ్వాలి



గత ఏడాది మినుములో అధిక దిగుబడి రాగా ఈ ఏడాది కౌలుకు తీసుకుని మరీ పంట సాగు చేశాం. మొదట్లో బాగానే ఉందనున్నా తర్వాత వాతావరణ ప్రతికూల పరిస్థితులతో తీవ్ర నష్టాలు చవిచూడాల్సి వచ్చింది. కౌలు రైతులకు కూడా నష్ట పరిహారం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- మోదేపల్లి జనార్దన్, రైతు, చిత్తలూరు

వైభవంగా వేమన జయంతి



నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : శతకకారుడు యోగి వేమన జయంతిని ఆదివారం నెల్లూరు నగరంలో ఘనంగా నిర్వహించారు. మాగుంట లే అవుట్ అనిల్‌గార్డెన్‌లో ఈ కార్యక్రమం జరిగింది. వేమన పద్యాల్లో భగవద్గీత సారాంశాలు ఉన్నాయని, అందుకే వేమనను దైవంగా భావించాలని ప్రజలకు తెలియజేసేందుకే జయంతి వేడుక నిర్వహిస్తున్నామని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక నెల్లూరు కమిటీ అధ్యక్షుడు డీ సురమౌళీ తెలిపారు. వేమన పద్యాల ద్వారా జీవిత సత్యాలను బోధించారన్నారు. కాగా, యోగి వేమన భగవాన్ ప్రతిమ ఊరి ఉత్సవం ఆకట్టుకుంది. మాగుంట లే అవుట్ నుంచి మినీబైపాస్ రోడ్డు, ముత్తుకూరుగేట్, మద్రాసు బస్టాండ్, ఆర్టీసీ, కేవీఆర్ పెట్రోలు బంకు మీదుగా మాగుంట లే అవుట్ అనిల్‌గార్డెన్స్ వరకు వేమన పద్యాలు, భగవద్గీత శ్లోకాలు ఆలపిస్తూ ఈ నగరోత్సం నిర్వహించారు. అనంతరం జరిగిన సభకు రెడ్డి ఐక్యవేదిక అధ్యక్షుడు నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ బీవీరెడ్డి, త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు పెంచల నరసింహయ్య, ఎంసీ సుధాకర్ ఆచారి, రత్నమాచారి, శేషారత్నమ్మ, శ్రీజ, సిద్ధార్థి, పాల్గొన్నారు.

ముగిసిన రాపత్తు ఉత్సవాలు



నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని రంగనాథస్వామి, మూలాపేట వేణుగోపాల స్వామి ఆలయాల్లో జరుగుతున్న అధ్యయనోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న రాపత్తు ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా విశేష అలంకరణ, పూజలు జరిగాయి. తల్పగిరి రంగనాథస్వామికి పల్లకీ సేవ నిర్వహించారు. టీడీపీ నేత వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇలా ఉంటే ప్రమాదాలు జరగవా?



తోటపల్లిగూడూరు మండలంలోని కొత్త పాలెంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు పిచ్చి మొక్కలు అల్లుకొన్నాయి. అయినా విద్యుత్‌శాఖ అధికారులు ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ను కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. ఆ పిచ్చి మొక్కలు అల్లుకున్న ట్రాన్స్‌ఫారంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందని ప్రజలు భయభ్రాంతులకు గురవుతోన్నారు. విద్యుత్ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

- తోటపల్లిగూడూరు(ఆంధ్రజ్యోతి)

న్యూస్ బాక్స్

డిగ్రీ అధ్యాపకుల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

నెల్లూరు(విద్య), జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ డిగ్రీ కళాశాలల గెజిటెడ్ అధ్యాపకుల సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నెల్లూరులోని డీకే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం జరిగిన సమావేశంలో సభ్యులంతా కలిసి కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా కోవూరు డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ కే రామ్‌ప్రసాద్, జిల్లా యూనిట్ కార్యదర్శిగా కందుకూరు డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ రాజగోపాల్‌బాబు, ఉపాధ్యక్షుడిగా డీకేడబ్ల్యూ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ వీ చెంచురామయ్య, కోశాధికారిగా డాక్టర్ టీ శ్రీరంజని, జాయింట్ సెక్రటరీగా విడవలూరు డిగ్రీ కళాశాల అధ్యాపకుడు కే రవిచంద్రారెడ్డి ఎంపికయ్యారు. అధ్యాపకుల సమస్యలు, విద్యారంగ ఇబ్బందుల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బంగారంతో స్వర్ణ కార్మికుడి పరారీ

నెల్లూరు(క్రైం), జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆభరణాల తయారీకి ఇచ్చిన బంగారు కడ్డీలతో తయారీదారుడు ఉడాయించిన ఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నెల్లూరులోని తిప్పరాజు వీధికి చెందిన పవన్ కుమార్ జైన్ పెద్దపోస్టాఫీసు మాధవపాటి వీధిలో బంగారు దుకాణం నిర్వహిస్తున్నారు. ఆయన వద్ద కొత్తూరు టైలర్స్ కాలనీకి చెందిన మహ్మద్ ఇంతియాజ్ బంగారు కడ్డీలు తీసుకుని కమిషన్ పద్ధతిపై ఆభరణాలు తయారీ చేసి ఇచ్చేవాడు. చెప్పిన సమయానికి ఆభరణాలు ఇస్తూ ఎంతో నమ్మకంగా ఉండేవాడు. ఈ నేపథ్యంలో గతేడాది డిసెంబరు 21, ఈ నెల 2వ తేదీన పవన్ జైన్ బంగారు ఆభరణాల తయారీ కోసం 550 గ్రాముల 600 మిల్లీగ్రాముల బంగారు కడ్డీలను ఇంతియాజ్‌కు ఇచ్చారు. రోజులు గడుస్తున్నా ఇంతియాజ్ ఆభరణాలు తయారుచేసి ఇవ్వలేదు. ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ అని రావడం, దుకాణం మూసి ఉండటంతో కొత్తూరులోని ఇంతియాజ్ ఇంటికి వెళ్లాడు. కొద్ది రోజులుగా ఆయన ఇంటికి రావడం లేదని తెలిసి చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దాడులు చేస్తే సహించం

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి

కావలి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలు, కార్యకర్తలు, సానుభూతిపరులపై దాడులు చేస్తే సహించమని వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. కావలి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న బోగోలు మండలం కోళ్లదిన్నె శ్రీనివాసులురెడ్డిని ఆదివారం మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్‌రెడ్డితో కలిసి కాకాణి పరామర్శించారు. కోళ్లదిన్నెలో ఎప్పుడో పాత గుడి కేసును దృష్టిలో పెట్టుకుని కూటమి నాయకులు శ్రీనివాసులరెడ్డిపై దాడి చేయడం దారుణమని అన్నారు. అనంతరం వారు కావలికి వెళ్లి డీఎస్పీ శ్రీధర్‌ను కలిసి విషయం తెలిపారు.



శ్రీనివాసరెడ్డికి వైసీపీ నేతల పరామర్శ

ప్రతి పంచాయతీకి మోడల్ పాఠశాల

- యూపీ పాఠశాలలు అప్‌గ్రేడ్
- విద్యాశాఖాధికారుల కసరత్తు

నెల్లూరు(విద్య), జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం జారీచేసిన పాఠశాలల విలీనానికి సంబంధించిన జీవో నంబరు 117ను కూటమి ప్రభుత్వం రద్దుచేసి, కొత్త ప్రతిపాదనలు రూపొందించి అమలు చేయాలని అధికారులను ఆదేశించింది. ప్రతి పంచాయతీకి ఒక మోడల్ పాఠశాలను ఏర్పాటు చేసేలా జాబితాలను సిద్ధం చేసి వచ్చే విద్యా సంవత్సరం నుంచే అమలు చేయాలని ఆదేశించింది. దీంతో అధికారులు ప్రాథమిక, యూపీ పాఠశాలల జాబితాలను సిద్ధం చేస్తున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్నీ జాగ్రత్తలు తీసుకుంటూ సమగ్ర వివరాలను సేకరించాలని ఎంఈవో హెచ్‌ఎంలతో మండలానికో టీమ్‌ను సిద్ధం చేసి కసరత్తు ప్రారంభించారు.

జీవో 117తో తీవ్ర ఇబ్బందులు

వైసీపీ ప్రభుత్వ పాలనలో అస్తవ్యస్తమైన విద్యావ్యవస్థను గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో దృష్టి సారించింది. ఇందులో ముఖ్యంగా పాఠశాలల విలీనానికి విడుదల చేసి జీవో నంబరు 117తో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఈ జీవోను రద్దు చేసి కొత్తగా పంచాయతీకి ఒక మోడల్ ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఇందుకోసం 60 మంది పిల్లలు ఉన్న పాఠశాలలను ఎంపిక చేయాలని, 6, 7, 8 తరగతుల్లో 60 మందికిపైగా ఉన్న యూపీ పాఠశాలలను హైస్కూల్స్‌గా అప్‌గ్రేడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చింది. దీంతో జిల్లా విద్యాశాఖాధికారులు కసరత్తు ప్రారంభించారు.



జిల్లాలో ప్రభుత్వ, మండల, జడ్పీ, మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలు 2,067, యూపీ పాఠశాలలు 197 వరకు ఉన్నాయి. వీటిల్లో 60 మందికి పైగా ఉండే ప్రాథమిక పాఠశాలల్లో ఒక దానిని ఎంపిక చేసి మండలంలో ఒక మోడల్ ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేయనున్నారు. అలాగే 60 మందికిపైగా ఉండే ప్రాథమికోన్నత పాఠశాలలను హైస్కూల్స్‌గా అప్‌గ్రేడ్ చేయనున్నారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో 60 మంది కంటే తక్కువగా ఉంటే ఆ విద్యార్థులను సమీపంలోని హైస్కూల్‌కు పంపిస్తారు. అదేవిధంగా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు, హెచ్‌ఎంల నియామకం చేపట్టనున్నారు. దీనికి సంబంధించి పూర్తి విధివిధానాలను ఉన్నతాధికారులు సిద్ధం చేస్తుండగా జిల్లా అధికారులు జాబితాలను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు సమర్పించనున్నారు. త్వరలో కమిషనర్‌తో జరిగే సమావేశంలో పూర్తిస్థాయిలో స్పష్టత వస్తుందని, కొత్త విద్యాసంవత్సరంలో ఈ పాఠశాలలను సిద్ధం చేస్తామని అధికారులు తెలిపారు.



నూతనంగా ఎంపికైన ఐక్య వేదిక కమిటీ

ఉద్యోగుల ఐక్య వేదిక కమిటీ ఏర్పాటు

నెల్లూరు(విద్య), జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా మాల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఐక్యవేదిక కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. నెల్లూరు హాస్పిటల్ ప్రాంగణంలోని సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో నేతలందరూ కలిసి కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. గౌరవాధ్యక్షుడిగా ఇంగిలాల మీరన్ మిశ్రా, అధ్యక్షుడిగా సర్వేపల్లి సాధ్వీన్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా జువ్విగుంట బాబు, నిర్వాహక కార్యదర్శిగా ఆత్మకూరు ఠాగూర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎంబేటి వినయ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా రాజు ఎంపికయ్యారు. మాలల ఐక్యత కోసం, ఉద్యోగుల సమస్యలపై పోరాటం చేయడంతో పాటు వర్గీకరణను వ్యతిరేకించే కార్యక్రమాలు చేపడతామని ప్రమాణం చేశారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నాయకులు ఈదూరు విజయ్‌కుమార్, నేతగాని హరి, బీ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి భూసర్వే

- పైలట్ ప్రాజెక్టుగా 35 మండలాల్లో నిర్వహణ
- 128 టీముల ఏర్పాటు, ఒక్కొక్క టీముకు ఒక్కో రోవర్

నెల్లూరు(హరనాథపురం), జనవరి 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కచ్చితమైన ప్రణాళికతో భూముల రీసర్వే సోమవారం (నేటి) నుంచి పునఃప్రారంభం కానుంది. గతంలో సర్వే జరగని గ్రామాల్లో ఏపీ రీసర్వే ప్రాజెక్టు కింద భూముల కొలతలు తీయనున్నారు. ఈ సర్వే పకడ్బందీగా సాగనుంది. గతంలో మాదిరిగా భూముల కొలతల్లో లోపాలకు తావులేకుండా, భూములున్న రైతుల నుంచి ఫిర్యాదులకు తావులేకుండా పారదర్శకంగా రీసర్వే చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నారు. వైసీపీ ప్రభుత్వంలో భూసర్వేలో అనేక తప్పులు దొర్లాయి. ఆ పార్టీ నేతల ఒత్తిడితో ఒక్కొక్క సర్వేయర్ రోజుకు సుమారు 40 ఎకరాలు కొలతలు తీశారు. ఒక్కొక్క మండలంలో ఒకేసారి నాలుగైదు గ్రామాల్లో కూడా రీసర్వే జరిగింది. అయితే ఆనాడు తగిన సిబ్బంది, అధికారులు లేనందున రైతుల అభ్యంతరాలను పెద్దగా స్వీకరించలేదు. ఎక్కడైనా విస్తీర్ణంలో వ్యత్యాసం వస్తే భూమి యజమానిని సంప్రదించకుండా కంప్యూటర్‌లలో ఎవరో ఒకరి పేరుతో ఎక్కువ పొలం ఎక్కించటం, లేదంటే తగ్గించటం చేశారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. భూహక్కు పత్రాల్లో తప్పులు, భూమి విస్తీరణం తగ్గిపోవటం, రీసర్వే పూర్తయిన గ్రామాల్లో కొందరు రైతుల భూవివరాలు ఆన్‌లైన్‌లో కనిపించకపోవటం, 1బీ, అడంగల్ పత్రాలు రాకపోవటం వంటి సమస్యలపై పలు ఫిర్యాదులు వచ్చాయి. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం రీసర్వేకు పూనుకోవటంతో పారదర్శకంగా జరిగేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

పైలట్ ప్రాజెక్టుగా...

ఏపీ రీసర్వే ప్రాజెక్టు కింద జిల్లాలోని 35 మండలాల్లోని ఒక్కొక్క గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపికచేసి సర్వే చేయనున్నారు. ఈసర్వేకు 128 టీములను ఏర్పాటు చేశారు. ఒక్కొక్క టీములో ఒక్కొక్క సర్వేయర్, వీఆర్వో, వీఆర్ఏ ఉంటారు. మండల సర్వేయర్, రీసర్వే డీటీ ఈసర్వేను పర్యవేక్షిస్తారు. ఒక్కొక్క టీము 200 నుంచి 300 ఎకరాలను సర్వే చేయిస్తాయి. ఒక టీముకు ఒక రోవర్(భూమిని కొలిచే యంత్రం) కేటాయించారు.

రైతులు సహకరించాలి



భూముల రీసర్వేకు రైతులు పూర్తి స్థాయిలో సహకరించాలి. జిల్లాలోని 35 మండలాల్లోని ఒక్కొక్క గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకుని ఈసర్వే నిర్వహిస్తాం. సోమవారం నుంచి ఈ సర్వే ప్రారంభమవుతుంది.

- నాగశేఖర్, సర్వేశాఖ సహాయ సంచాలకులు



సర్వేశాఖ కార్యాలయం

85వేల ఎకరాల్లో రీసర్వే

రీసర్వే 37 మండలాల్లోని 85,479 ఎకరాల్లో జరుగనుంది. ఈ సర్వేకు గతంలో తీసిన డ్రోన్ చిత్రాల ఆధారంగా భూముల కొలతలు ప్రారంభమవుతాయి. తొలుత గ్రామ సరిహద్దులు, ప్రభుత్వ భూముల సర్వే జరిపి, ఆ తరువాత ప్రైవేట్ భూముల రీసర్వే నిర్వహిస్తారు. విస్తీర్ణం, రైతు వివరాలు, ప్రస్తుత భూయజమాని, సెటిల్ మెంట్ టైటిల్ డీడ్ వంటివి నిర్ధారిస్తారు. భూయజమానులకు ముందుగా సమాచారాన్ని తెలియచేసి వారి సమక్షంలోనే హద్దులు నిర్ణయిస్తారు. ఫిర్యాదులుంటే పరిశీలించి పరిష్కరిస్తారు.

వాట్స్‌ప్‌లో వివరాలు

ఒక గ్రామానికి చెందిన రైతుల కోసం వాటప్స్ గ్రూపును ఏర్పాటు చేసి, రైతుల వివరాలు, ఫోన్ నంబర్లు నమోదు చేస్తారు. రైతులకు ఎప్పటికప్పుడు వాటప్స్ ద్వారా సమాచారం ఇస్తారు. సర్వే సందర్భంలో రైతు లేకపోతే అతడి ఏజెంటు సమక్షంలోనైనా సర్వే చేసి హద్దులు నిర్ధేశిస్తారు. భూయజమాని, అతని ఏజెంటు లేకపోయినా కొలిచిన భూవివరాలను వాటప్స్ ద్వారా సంబంధిత భూయజమానికి తెలియచేస్తారు. ఆ కొలతలపై అభ్యంతరాలు ఉంటే రైతులు అప్పటికప్పుడు అధికారులకు తెలియచేయవచ్చు. ఇలా ఒక్కొక్క గ్రామంలో రీసర్వేకు ప్రభుత్వం మూడు నాలుగైదు నెలల సమయం కేటాయించాలని రైతులు కోరుతున్నారు.



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

కంటైనర్‌ను ఢీకొన్న లారీ

కావలి రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ముందువెళ్తున్న కంటైనర్‌ను వెనుకవైపు ఉన్న కారు ఢీ కొన్న సంఘటనలో ఆదివారం ఆముదాలదిన్నె సమీపంలోని జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తున్న యశ్వంత్, భరత్ మరో యువకుడు సంక్రాంతి పండుగ అనంతరం కాకినాడ నుంచి యశ్వంత్ కారులో బెంగుళూరుకు బయలుదేరారు. మార్గమధ్యలో ఈ ప్రమాదం జరగడంతో వారు స్వల్పంగా గాయపడ్డారు. హైవేపై పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు ప్రమాదాన్ని గుర్తించి అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి వారిని వైద్యశాలకు తరలించారు.

రాష్ట్ర ఆర్చరీ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఆదివారం జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాల, బాలికల జిల్లా జట్లను ఎంపిక చేశారు. క్రీడాకారులకు వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర పోటీలకు ఎంపిక చేశారు. ఇండియన్ రౌండ్ బాలుర విభాగంలో వెంకట లోకేష్, సాత్విక్, ప్రసన్నకుమార్ యాదవ్, కార్తికేయన్, మహీధర్, హరిశ్రీకర్ ఎంపికయ్యారు. బాలికల విభాగంలో దీత్యా చండిక, లాస్య, ఆవియా, మాన్విత, మోక్షారెడ్డి, క్రితికా కిరణ్ ఎంపికయ్యారు. రికర్వ్‌రౌండ్ బాలుర విభాగంలో సాయి మౌర్యా, తరుణీష్ జాత్యా, రాజేష్, జిగ్నేష్, బాలికల విభాగంలో డెలీషా, నిష్విత, లక్ష్మీభావాగ్ని హంసిని ఎంపికయ్యారు. కాంపౌండ్ రౌండ్ బాలుర విభాగంలో వరుణ్‌రెడ్డి, రమేష్‌కుమార్, వికాస్, అక్షిత్, బాలికల విభాగంలో యశస్విని, జననీరెడ్డి, గాయత్రినివాన్యలు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 23 నుంచి విజయవాడలో జరిగే 33వ ఎన్‌టీపీసీ ఆర్చరీ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు పల్లంరెడ్డి శ్రీహర్ష, పావురాల వేణు తెలిపారు.



రాష్ట్ర పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

సోమశిలకు 1,918 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం జనవరి 19 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి ఆదివారం 1,918 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ప్రస్తుతం 69.515 టీఎంసీల నిల్వ ఉంది. దిగువ కండలేరుకు 200, డెల్టాకు 2,550, ఉత్తర కాలువకు 650, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

జాతీయ చిత్రకళా పోటీల్లో నెల్లూరీయులకు అవార్డులు

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : అమలాపురం బ్రహ్మోత్సవ కళానిధి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన 35వ జాతీయ స్థాయి చిత్రకళా పోటీల్లో పాల్గొన్న నెల్లూరు చిత్రకారులు అవార్డులు దక్కాయి. డాక్టర్ అమీర్‌జాన్ వేసిన సన్‌మంత్ర చిత్రం, ముదివర్తి సుందరబాబు గీసిన సంగీత అనే పెయింటింగ్, దొర్నాదుల శేషయ్య వేసిన పెండ్లి పనుల చిత్రాలకు పురస్కారాలు లభించాయి. ఆదివారం సాయంత్రం ఆ ముగ్గురు చిత్రకారులకు ప్రముఖ పబ్లిసిటీ డిజైనర్ కడలి సురేష్, చిత్రకళాపరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు కోరసాల సీతారామస్వామి, ప్రజాప్రతినిధులు అవార్డులు అందజేశారు.



దొర్నాదుల శేషయ్య వేసిన పెండ్లి ఇంట పసుపు దంచే చిత్రం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కంటేపల్లి సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. నెల్లూరు నగరంలోని కొత్తూరు ప్రాంతానికి చెందిన శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యంలు మోటర్‌బైక్‌పై దైవదర్శనం కోసం గొలగమూడికి వచ్చి తిరిగి నెల్లూరుకు వెళ్తుండగా కంటేపల్లి దాటిన తర్వాత రైల్వే గేటు సమీపంలో ఉన్న మలుపు వద్దకు వచ్చేసరికి ఎదురుగా ఆటో దూసుకొని రావడంతో తప్పించుకునే క్రమంలో బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈప్రమాదంలో ఇద్దరు గాయపడగా చికిత్స నిమిత్తం వెంకటాచలం సీహెచ్‌సీకి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పక్కాగృహాలు మంజూరు చేయిస్తాం

దగదర్తి, (బిట్రగుంట), (ఆంధ్రజ్యోతి): దళితుల సమస్యలను ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లి పక్కా గృహాలను మంజూరు చేయిస్తానని టీడీపీ రాష్ట్ర నేత పీ. రవికుమార్ చౌదరి తెలిపారు. ఉప్పలపాడు గిరిజనకాలనీలో ఆదివారం ఆయన పర్యటించారు. ఆయన వెంట నేతలు ఏ హనుమంతరావు, శ్రీనివాసులురెడ్డిలు ఉన్నారు.

చేజర్ల డ్రాయింగ్ మాస్టర్‌కు అవార్డు



చేజర్ల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ మాస్టర్‌గా పనిచేస్తున్న తోట కిషోర్‌కుమార్ అమలాపురంలో నిర్వహించిన చిత్రకళా పోటీలలో కళానిధి అవార్డును గెలుచుకున్నారు. కోనసీమ చిత్రకళా పరిషత్ వారు ఆదివారం అమలాపురంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఆర్ట్ కాంపిటేషన్‌లో ఈ అవార్డును అందుకున్నట్లు ఆయన తెలిపారు. అవార్డు రావడంతో తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

కళానిధి అవార్డును అందుకుంటున్న తోట కిషోర్

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	129
లేయర్ లైవ్	88
స్కిన్ చికెన్	232
స్కిన్‌లెస్	256
లేయర్	150

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7658
వెండి కిలో ధర	రూ. 93,100
వెండి ఒక గ్రాము	రూ.96.10

సత్ప్రవర్తనతో మెలిగితే
రౌడీషీట్ తొలగింపు



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ వేణుగోపాల్

సంగం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు వివాదాల జోలికి వెళ్లకుండా సత్ప్రవర్తనతో మెలిగితే రౌడీషీట్ తొలగిస్తామని ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ తెలిపారు. ఆదివారం ఆయన సంగం పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌పేట, చేజర్ల, సంగం మూడు మండలాల సర్కిల్ పరిధిలోని రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రౌడీషీటర్ల గత కేసుల వివరాలు, ప్రస్తుతం వారి ప్రవర్తన తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సీఐ వేమారెడ్డి, మూడు మండలాల ఎస్ఐలు, ఏఎస్ఐలు పాల్గొన్నారు.

గాడితప్పిన దేశ ఆర్థిక వ్యవస్థ

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రామ్‌భూపాల్



సదస్సులో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రామ్‌భూపాల్

ఆత్మకూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడిదారుల కబంధ హస్తాల్లో చిక్కుకుని దేశ ఆర్థిక వ్యవస్థ గాడితప్పిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వీ రామ్‌భూపాల్ అన్నారు. స్థానిక నేతాజీ క్లబ్‌లో ఆదివారం పెట్టు బడి - ప్రజాస్వామ్యం అనే అంశంపై సీపీఎం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ దేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రజాస్వామ్యంపై ప్రభావం చూపుతోందని, ప్రభుత్వాలు ఇప్పటికైన మేల్కొనకపోతే దేశంపై పెనుప్రభావం చూపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి కె డేవిడ్‌రాజు, జిల్లా కౌలురైతు సంఘం జిల్లా నాయకుడు జి లక్ష్మీపతి, జిల్లా సెక్రటేరియట్ సభ్యులు మూలి వెంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు అన్వర్‌బాషా, రైతు సంఘం నాయకులు లక్కు ప్రసాద్, సిఐటియు నాయకుడు జి శివప్రసాద్, సీపీఎం, సిఐటియు అనుబంధ సంఘాల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

23న వరికుంటపాడు మండల సర్వసభ్య సమావేశం

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), జనవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈనెల 23వ తేదీన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వేణుగోపాల్‌రావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎంపీపీ అధ్యక్షతన జరిగే సమావేశంలో శాఖలవారీగా అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించడంతో పాటు పారిశుధ్యం, సీజనల్ వ్యాధులు, తదితర అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు, సభ్యులు తప్పక హాజరు కావాలని కోరారు.

ఐటా కార్యవర్గం ఎన్నిక



ఎంపికైన ఐటా కార్యవర్గం సభ్యులు

ఉదయగిరి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక జమాతే ఇస్లామీ హింద్ కార్యాలయంలో ఆల్ ఇండియా ఐడల్ టీచర్స్ అసోసియేషన్ (ఐటా) ఉదయగిరి నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఫయాజ్, లియాఖత్‌అలీ, ఉపాధ్యక్షుడిగా రఫీ, ఖలీల్, జాయింట్ కార్యదర్శులుగా నాయబ్‌రసూల్, మసూద్, మదరసా కార్యదర్శిగా సయ్యద్ అఫ్రోజ్, కోశాధికారిగా నస్రుల్లా, గౌరవాధ్యక్షులుగా ఇస్మాయిల్‌సాహెబ్, ముఖ్య సలహాదారునిగా ఎస్ మున్నాలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఎన్నికల పరిశీలకులుగా ఐటా మాజీ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్‌రజాక్, మాజీ జాతీయ కార్యదర్శి షాకీర్‌హుస్సేన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మకు నెల పొంగళ్లు

వింజమూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గంగమిట్ట దగ్గర వున్న శ్రీగంగాభవానీ దేవస్థానంలో ఆదివారం గంగమ్మ తల్లికి నెల పొంగళ్లు నిర్వహించారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. దేవస్థాన కమిటీ భక్తులకు సౌకర్యాలు కల్పించారు.

పాలలక్ష్మమ్మకు విశేష పూజలు

ఉదయగిరి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సున్నవారిచింతల గ్రామ మామిడితోపులో ఉన్న శ్రీడిల్లీ పాలలక్ష్మమ్మ అమ్మవారికి ఆదివారం కొల్లిబోయిన వంశస్తులు విశేష పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి గణపతి పూజ, పుణ్యహవచనం, నవగ్రహ మండపారాధన, పంచామృతాభిషేకాలు, కుంకుమ పూజ, ప్రత్యేక అలంకరణ కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి భక్తులు పల్లకిసేవ నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

బాధితుడికి ఆర్థిక సహాయం



బాధితుడికి నగదు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న వరికుంటపాడుకు చెందిన సంచిబోయిన మాల్యాద్రికి ఆదివారం మానవతా సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. విషయం తెలుసుకున్న అధ్యక్ష, కార్యదర్శులు ఎం ముసలయ్య, ఎన్ బాబురావు బాధితుని నివాసానికి వెళ్లి తమవంతు చేయూతగా రూ. 5వేలు నగదు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో కన్వీనర్ వీ వెంకటేశ్వరారావు, మాజీ అధ్యక్షుడు వీ తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచు మట్టి హరినారాయణ, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టాభిని కలిసిన నేతలు

కందుకూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కందుకూరులోని పార్టీ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టాభిని ఆదివారం పార్టీ నియోజకవర్గ నేతలు దామా మల్లేశ్వరరావు, తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. వారి వెంట స్థానిక నేతలు వడ్లమూడి సురేష్, పొడపాటి నాగేశ్వరరావు, ఉన్నం వీరాస్వామి, భవనాసి వెంకటేశ్వర్లు, మురారిశెట్టి సుధీర్, కోట కిషోర్ ఉన్నారు.

నేటి నుంచి ఉచిత పశువైద్య శిబిరాలు

కందుకూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని పంచాయతీల్లో సోమవారం నుంచి 31వరకు ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు మండల ఇన్‌చార్జి పశువైద్యాధికారి ఎస్. సుధాకర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిబిరంలో గేదెలు, దూడలకు డీవార్మింగ్ మందులు, గొర్రెలు, మేకలలో నట్టల నివారణ మందులు, బొబ్బరోగం రాకుండా ముందస్తు టీకాలు వేస్తామని, పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రికెట్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

ఉదయగిరి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగళరావునగర్ గ్రామంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ముత్యాలపాటి అబ్దుల్‌ఖాదర్ జ్ఞాపకార్థం నిర్వహించిన మెగా క్రికెట్ పోటీల్లో విజేతలకు ఆదివారం నిర్వాహకుడు హనీఫ్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీల్లో వెంగళరావునగర్ జట్టు ప్రథమ, ఉదయగిరి మెకానికల్ రాయల్ జట్టు ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. వారికి నిర్వాహకులు వరుసగా రూ.30 వేలు, రూ.20 వేల చొప్పున నగదు బహుమతి, ట్రోఫీలను అందజేశారు. అలాగే ఆటలో ప్రతిభ చూసిన క్రీడాకారులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు అబ్దుల్, మహ్మద్‌ఖాజా, గ్రామపెద్దలు షేక్ రియాజ్, షరీఫ్, గుంటుపల్లి ఖాదర్‌బాషా, ముస్తఫా, గౌస్‌మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ పోటీల్లో ప్రథమ విజేతకు బహుమతి అందజేస్తున్న హనీఫ్

వేతనాలు అందక పారిశుధ్య కార్మికుల అవస్థలు



వైద్యశాలలో డస్టబిన్‌లు శుభ్రంచేస్తున్న పారిశుధ్య సిబ్బంది

ఉదయగిరి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఎనిమిది మంది పారిశుధ్య కార్మికులకు గత ఐదు నెలలుగా వేతనాలు అందకపోవడంతో అవస్థలు పడుతున్నారు. నెలల తరబడి వేతనాలు అందకపోవడంతో కుటుంబ పోషణ భారమైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బకాయిలు పేరుకుపోవడంతో కూరగాయలు, కిరాణ దుకాణాల్లో సైతం అప్పులు ఇవ్వక పస్తులుండాల్సిన దుస్థితి నెలకొందన్నారు. తమకు నెలకు రూ.16 వేలు వేతనానికిగాను రూ.12 వేలు మాత్రమే ఇస్తున్నారని వాపోయారు. అందులో పీఎఫ్, ఈఎస్ఐలు నగదు సైతం గత మూడేళ్లుగా ఇవ్వడంలేదన్నారు. పస్తులుంటూ విధులకు హాజరు కావాల్సి వస్తోందని కన్నీటిపర్యంతమయ్యారు. వైద్యశాలలో పారిశుధ్యం పనులతోపాటు రోగులను ఒక వార్డు నుంచి మరో వార్డుకు తరలించడం, స్టోర్ నుంచి మందులు తీసుకురావడం, క్షతగాత్రులకు డ్రస్సింగ్ చేయడం తదితర పనులు సైతం అదనంగా చేస్తున్నామని, వైద్యశాలలో తమ పనితో పాటు ఇతరత్రా పనులు చేస్తున్నా సకాలంలో వేతనాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. వేతనాలు సకాలంలో చెల్లించాలని పాలకులు, అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని, ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తమకు వేతనాలు చెల్లించేలా చర్యలు చేపట్టాలని వారు వేడుకొంటున్నారు.

కుటుంబ పోషణ భారమైంది..

-రత్తమ్మ, పారిశుధ్య కార్మికురాలు



ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో కుటుంబ పోషణ భారమైంది. పీఎఫ్, ఈఎస్ఐల బకాయిలు సైతం గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వేతనాలు చెల్లించాల్సి ఉంది.

పస్తులుండాల్సి వస్తోంది...

-నారాయణ, పారిశుధ్య కార్మికుడు



ఐదు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంమంతా పస్తులుండాల్సి వస్తోంది. కూరగాయలు, కిరాణా దుకాణాల్లో అప్పు పెరిగిపోవడంతో వారు సరుకులు ఇవ్వడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వేతనాలు చెల్లించాలి.

యోగి వేమన పద్యాలు ప్రజలకు స్ఫూర్తిదాయకం



ఉదయగిరి: యోగివేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

ఆత్మకూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రజాకవి, సంఘసంస్కర్త యోగి వేమన జయంతి వేడుకలను ఆదివారం ఎంపీడీవో కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సి శ్రీనివాసులు మాట్లాడుతూ అచ్చ తెలుగు పదాలతో తెలుగుజాతి కీర్తిని చాటిన కవి వేమన అని, ఆయన పద్యాలు ఈనాటికీ ప్రజలందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపిఆర్‌డి డేవిడ్, కె శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

●ఉదయగిరి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం యోగివేమన జయంతిని పురస్కరించుకొని ఉద్యోగులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తన రచనల ద్వారా సమాజాన్ని చైతన్యపర్చిన అభ్యుదయవాది, ప్రజాకవి, సంఘసంస్కర్త యోగివేమన అని పలువురు వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసరాజు, సీనియర్ అసిస్టెంట్ ఖాజానవాజ్, డీఈవో ఇమ్రాన్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ షరీఫ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



కందుకూరు: మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నేతలు

కందుకూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో నెల్లూరులో జరగనున్న సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ సీనియర్ నాయకుడు ముప్పరాజు కోటయ్య కోరారు. ఆదివారం ఆయన స్థానిక సీపీఎం కార్యాలయంలో రాష్ట్ర మహాసభల గోడపత్రిక ఆవిష్కరించారు. మహాసభల ముగింపు సందర్భంగా 3న సాయంత్రం ఆత్మకూరు బస్టాండ్ వద్ద నుంచి భారీ ప్రదర్శన అనంతరం వీఆర్ హైస్కూల్ గ్రౌండ్‌లో బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. ఈ సభకు కేంద్ర కమిటీ నాయకులు, రాష్ట్ర నాయకులు పాల్గొంటారని చెప్పారు. సమావేశంలో ఎస్ఏ గౌస్, మున్వర్‌సుల్తానా, నాదెండ్ల కోటేశ్వరరావు, మల్లికార్జున, మల్లిక, పద్మ, పవన్‌కుమార్, డీఎం రాయుడు పాల్గొన్నారు.

●బిట్రగుంట: ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయమే ధ్యేయంగా సీపీఐ (ఎం) పనిచేస్తుందని పార్టీ సీనియర్ నాయకులు తాళ్లూరు మాల్యాద్రి తెలిపారు. బోగోలు పార్టీ కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర మహా సభల వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో కావలి ప్రాంతీయ కమిటీ సభ్యులు గడ్డం మాల్యాద్రి, తుమ్మల వెంకయ్య, సీఐటీయు జిల్లా కమిటీ సభ్యులు చల్లా నరహరి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పోట్లూరి శ్రీనివాసులు ఉన్నారు.

●ఉలవపాడు : మండల కేంద్రంలో ఆదివారం సీపీఎం రాష్ట్ర మహాసభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సీఐటీయూ మండల నాయకులు మాదాల రమణయ్య, ఎస్‌డీ గౌస్‌బాషా ఆవిష్కరించారు. అనంతరం వరిగిచేను ఎస్టీ సంఘంలో సీఐటీయూ ప్రాంతీయ పార్టీ సమావేశం నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సీపీఎం అనేక సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌డీ జహీర్, కత్తి సుజాత, దార్ల మాధవరావు, వై.సరళ తదితరులు పాల్గొన్నారు.

పెదపవనిలో పోలీస్ పికెట్



పెదపవనిలో పీర్లచావిడి స్థలం వద్ద పికెట్ నిర్వహిస్తున్న పోలీసులు

లింగసముద్రం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పెదపవనిలోని వివాదాస్పద పీర్లచావిడి స్థలం వద్ద ఆదివారం పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు. ఈ స్థలం వద్ద రెండురోజులుగా రెండువర్గాల ప్రజలు ఘర్షణ దిగిన జరిగిన విషయం తెలిసిందే. రెవెన్యూ అధికారులు గ్రామ సర్వే నంబరు 439/1లోని ఈ స్థలం వద్ద 164 సెక్షన్‌ను విధించి, ఇందులోకి ఎవరు ప్రవేశించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇరు వర్గాలకు నోటీసులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు మేరకు ఎస్ఐ షేక్ మహబూబ్ సుభానీ ఏఎస్ఐ, ఇద్దరు పోలీసు సిబ్బంది కాపాలా ఉంచారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



మృతురాలి కుమారుడికి ఆర్థికసాయం అందిస్తున్న స్థానిక నేతలు

కావలి రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మరణించిన సిరిపురం టీడీపీ సభ్యురాలు షేక్ బేబమ్మ (65) మృతి చెందింది. విషయం తెలుసుకున్న స్థానిక టీడీపీ నేతలు కుటుంబ సభ్యులను పరామర్శించారు. టీడీపీ సభ్యత్వం కలిగిఉన్న బేబమ్మ మృతి చెందిన విషయాన్ని స్థానిక సీనియర్ నాయకుడు నాయుడు రాంప్రసాద్ ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి దృష్టికి తీసుకువెళ్లాడు. ఈ సందర్భంగా మృతురాలి కుమారుడు ఖాజామొహిద్దీన్‌కు అంత్యక్రియల నిమిత్తం రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో నాయుడు శ్రీను, ఉప్పాల జాలరావు, కొత్తపల్లి పెంచల ప్రసాద్, వల్లూరు దయాకర్ నాయుడు, రత్నంరాజు, పరుసు వెంకటేశ్వర్లు, తిరుపతి, మోర్ల వెంకట్రావ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల్లో అక్రమ కట్టడాలు

● పట్టించుకోని అటవీ, దేవదాయశాఖ అధికారులు



మాలకొండలోని ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మిస్తున్న గదులు

వలేటివారిపాలెం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మాలకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వెళ్లే రోడ్డును ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలంలో యథేచ్ఛగా అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయి. ఈ సమస్యను సంబంధిత అటవీ, దేవాదాయశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. కోట్ల విలువైన ప్రభుత్వ స్థలంలో అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నా అటు అటవీ, ఇటు దేవాదాయశాఖ అధికారులు మాకెందుకులే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులు కాపాడాల్సిన అధికారులే ఇలా చేస్తుండటంతో భక్తులు, స్థానికులు వాపోతున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు నరసింహస్వామి దర్శనానికి వస్తుంటారు. వీరికి ఆలయ పరిధిలో పూర్తిస్థాయిలో విశ్రాంతి గదులు లేవు. దీంతో భక్తులు అద్దెలు చెల్లించి ప్రయివేట్ గదులను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలం ఆక్రమణలకు గురికాకుండా కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

జాయింట్ సర్వే చేయాలని కోరాం : సురేష్, అటవీశాఖ అధికారి

మాలకొండలో నేషనల్‌హైవే రోడ్డును ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలంలో అక్రమ కట్టడాలపై అటవీశాఖ అధికారి సురేష్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరింది. తాము దేవాదాయశాఖ అధికారులను కలిసి జాయింట్ సర్వే చేసేందుకు రెవెన్యూ అధికారులను కోరినట్లు తెలిపారు.

మందుబాబులకు అడ్డాగా సచివాలయ భవనం



వెంకటరెడ్డిపల్లిలో అసంపూర్తిగా ఉన్న సచివాలయ భవనం

కలువాయి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటరెడ్డిపల్లిలో అసంపూర్తిగా ఉన్న గ్రామ సచివాలయ భవనం మందుబాబులకు అడ్డాగా మారింది. వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన సచివాలయం, రైతు భరోసా కేంద్రాల భవనాలు అసంపూర్తిగా నిర్మించి వదిలేశారు. దీంతో ఇక్కడ మందుబాబులు మద్యం సేవించడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా అసంపూర్తి భవనాలు పూర్తిచేసి ఉపయోగంలోకి తీసుకురావాలని గ్రామస్థులు అధికారులను కోరుతున్నారు.

అభయం స్వచ్ఛంద సంస్థ సభ్యుల ఔదార్యం

● బిచ్చగాడి మృతదేహానికి దహన సంస్కారాలు

కావలి. జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భిక్షగాడు శంకరయ్య ఆదివారం మరణించాడు. విషయం తెలుసుకున్న అభయం స్వచ్ఛంద సంస్థ సేవకులు సంస్థ సేవకులు యిలింద్ర వెంకటేశ్వర్లు(ఈవీఎస్), బాష, శ్రీనులు అంతిమరథం డ్రైవర్ సునీల్‌తో కలిసి అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు. మొదట కావలి ఒకటో పట్టణ రైటర్ సుబ్బయ్య సంస్థ నిర్వహకులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని అంతిమరథంలో శ్మశానానికి తీసుకెళ్లి సొంత ఖర్చులతో అంత్యక్రియలు నిర్వహించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

● జీ వేణుగోపాల్‌రావు, ఎంపీడీవో



వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), జనవరి 19 (ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం వహించే సచివాలయ ఉద్యోగులపై చట్టపరమైన చర్యలు తప్పవని ఎంపీడీవో వేణుగోపాల్‌రావు ఆదివారం తెలిపారు.

? సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటిస్తున్నారా.

! ప్రతి ఉద్యోగి సమయ పాలన పాటిస్తూ సాయంత్రం వరకు ప్రజలకు అందుబాటులో ఉండాలి. అలా ఉండని వారిపై ప్రత్యేక నిఘా ఉంచి శాఖా పరమైన చర్యలు చేపడతాం.

? లక్ష్య సాధనలో వెనుకబడిన వారిపై చర్యలు చేపడుతున్నారా.

! ప్రభుత్వం నిర్దేశించిన మేరకు లక్ష్య సాధనలో కొంత మంది వెనుకబడిన మాట వాస్తవమే. అలాంటి పంచాయతీ కార్యదర్శులకు ఇటీవల నెలవారీ వేతనాలను నిలిపివేశాం. అలాగే వెల్ఫేర్ అసిస్టెంట్లకు సైతం షోకాజ్ నోటీసులు అందజేశాం.

? పారిశుధ్యం మెరుగుకు ఏవిధంగా కృషి చేస్తున్నారు.

! పంచాయతీల వారీగా గ్రామాల్లో పరిశీలన చేపడుతున్నాం. సమస్యలను పరిష్కరించేలా కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చాం. ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛత దివస్ కార్యక్రమంలో భాగంగా గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం.

న్యూస్ బాక్స్

ప్రకృతిని పరిరక్షించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ధ్యానులు

వింజమూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చిత్తూరు సీనియర్ పిరమిడ్ మాస్టర్ శ్రీనివాస అన్నారు. స్థానిక శ్రీవేదవ్యాస వశిష్ట పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో ఆదివారం ఆత్మజ్ఞానం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అనంతరం శాకాహారం ప్రాముఖ్యత వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. చెన్నకేశవస్వామి బజారు, పిరమిడ్ నగర్, ఎర్రబెల్లిపాలెం ప్రధాన వీధుల మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ధ్యానులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



పేదలకు దుప్పట్లు అందజేస్తున్న డబ్బుకొట్టు వసుంధర

కందుకూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నిరుపేదలు, యాచకులకు ఆదివారం అయ్యప్పసేవా సంఘం సభ్యులు డబ్బుగొట్టు వసుంధర దుప్పట్లు, ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. పట్టణంలోని ఆలయాలు, అనాథలైన నిరుపేదలు ఉండే ఇతర ప్రాంతాలకు వెళ్లి ఈ చర్యలు తీసుకున్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రపై విదార్థులకు అవగాహన



చిన్నారులతో గ్రంథపాలకుడు కోటేశ్వరరావు

ఉలవపాడు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు సంక్రాంతి సెలవులు రావడంతో విదార్థులు స్థానిక గ్రంథాలయానికి ఉపయోగించుకుంటున్నారని గ్రంథ పాలకుడు దాసరి కోటేశ్వరరావు తెలిపారు. ఆదివారం గ్రంథాలయానికి వచ్చిన విద్యార్థులతో స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్ర, వార్తా పత్రికల్లోని ప్రధాన అంశాలు, తెలుగు పదాల ఉచ్ఛరణ అంశాలను తెలియజేశారు.

ట్రిబ్యునల్ సమావేశానికి ప్రొఫెసర్ కడియాలకు ఆహ్వానం

జలదంకి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గ్రీన్ ఫీల్డ్ కేపిటల్ అమరావతి నిర్మాణానికి సంబంధించి జాతీయ హరిత ట్రిబ్యునల్ సమావేశం ఈ నెల 21న అమరావతిలో జరగనుంది. ఈ సమావేశానికి ట్రిబ్యునల్ ఇంప్లిమెంటేషన్ కమిటీలో సభ్యుడు ప్రొఫెసర్ కడియాల వెంకటేశ్వర్లుకు ఆహ్వానం అందింది. రాజధానిలో జరుగుతున్న నిర్మాణాలపై సీఆర్‌డీఏ ఇచ్చే నివేదకను పరిశీలించి హరిత ట్రిబ్యునల్ నిబంధనల మేరకు రాజధాని నిర్మాణం జరుగుతుందో లేదో అని పరిశీలించి పలు సూచనలు హరిత ట్రిబ్యునల్ కమిటీ ఇవ్వనుంది.

రూరల్, కోవూరు, సర్వేపల్లి

కేంద్రాలకు ఆదరణ కరువు!

మూయలేక, నడపలేక అయోమయం

మీ సేవలు వద్దు



మనుబోలు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు, జనన, మరణ ధ్రువీకరణలు పొందాలన్నా, రేషన్‌కార్డుల్లో మార్పులు, చేర్పులు చేయించుకోవాలన్నా, విద్యుత్ బిల్లులు, నీటి పన్నులు చెల్లించాలన్నా, భూముల మ్యూటేషన్ కట్టాలన్నా ఒక్కప్పుడు మీ-సేవ కేంద్రమే దిక్కు. అటువంటి కేంద్రాలు నేడు ఆదరణ కోల్పోతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి టీడీపీ హయాంలో చంద్రబాబు ఏపీ టెక్నాలజీ సర్వీసెస్, టీసీఎస్ భాగస్వామ్యంలో మీ-సేవ కేంద్రాలను ప్రవేశపెట్టారు. వాటి ద్వారా ప్రజలకు వివిధ సేవలు అందించేలా తీర్చిదిద్దారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి మీసేవ కేంద్రాలను నిర్వీర్యం చేసింది. దీంతో ఆపరేటర్లు అటు కేంద్రాలను నడపలేక, ఇటు మూసివేయ లేక అయోమయంలో పడ్డారు. 2019 నాటికి జిల్లాలో 500కుపైగా మీ-సేవ కేంద్రాలు నడుస్తుండేవి. ఆ తర్వాత ఆదరణ లేక 350కు పైగా కేంద్రాలు మూతపడ్డాయి. గతంలో రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి ఈసీ, ఆస్తులకు సంబంధించిన సర్టిఫైడ్ కాపీలు, ఆస్తులు, వ్యవసాయ భూముల కొనుగోళ్లలో మ్యూటేషన్ పత్రాలు కూడా మీ-సేవ కేంద్రాల్లో జారీ చేసేవారు. ప్రస్తుతం ఈ సేవలు రద్దు చేశారు. గతంలో రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా ఆస్తులకు ఈసీలు పొందే వెసులుబాటు ఉండేది. సచివాలయాల రాకతో ఇవన్నీ మాయమయ్యాయి.

● **సాంకేతిక సమస్య**

మీ-సేవ కేంద్రాల్లో నిర్ణీత రుసుం చెల్లిస్తే ఎన్ని కాపీలైనా ప్రింట్ తీసుకునే అవకాశం ఉంటుంది. అయితే సచివాలయాల్లో ప్రస్తుతం డిజిటల్ కాపీలు మాత్రమే జారీ చేస్తున్నారు. కులం, ఆదాయం, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ వంటి వాటికి ఒక్క కాపీ మాత్రమే ఇస్తున్నారు. ఈ పరిస్థితి ప్రజలకు అసౌకర్యంగా మారింది. కాగా, గత ఎన్నికలకు ముందు యువగళం పాదయాత్రలో తనను కలిసిన ఆపరేటర్లకు మీ-సేవ కేంద్రాలు కొనసాగిస్తామని లోకేష్ హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో మీ సేవా కేంద్రాలకు ప్రభుత్వం పూర్వవైభవం తీసుకువస్తుందని ఆపరేటర్లు ఆశగా ఎదురుచూస్తున్నారు.

కళ కళ వెలవెల



నగరంలోని కొన్ని కూడళ్లలో కొత్త బొమ్మలు, వాటర్ ఫౌంటెన్లు, లైటింగ్ ఏర్పాటు చేయడంతో ఆయా ప్రాంతాలు కళకళలాడుతున్నాయి. అదే సమయంలో మరికొన్ని ప్రాంతాల్లోని పౌంటెన్లను పట్టించుకోకపోవడంతో అవి వెలవెలబోతున్నాయి.





వీఆర్సీ, గాంధీబొమ్మ సెంటర్లలో పనిచేయని ఫౌంటెన్లు





ఏసీ స్టేడియం వద్ద ఇలా..





ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్

సజ్జాపురంలో 'గడప గడపకు..'



వృద్ధుడికి సంక్షేమ పథకాల కరపత్రం అందచేస్తున్న గిరిధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, జనవరి 19,(ఆంధ్ర జ్యోతి): మండలంలోని సజ్జాపురం గ్రామంలో ఆదివారం టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి గడప గడపకు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వ పథకాలను తెలిపారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలకు ఏ కష్టం వచ్చినా తనకు చెబితే అండగా నిలబడేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. అటు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, ఇటు తాను ఎప్పుడూ ప్రజల్లోనే ఉంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు సహకరించాలి : సీపీఎం

నెల్లూరు రూరల్, జనవరి 19 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని దొంతాలి గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు అందరూ సహకరించాలని, నాయకులు ఇబ్బందులకు గురిచేయడం సరికాదని సీపీఎం నాయకులు కోరారు. ఆదివారం ఆ గ్రామంలో పార్టీ నాయకులు తిరుపాలు, గోపాల్ మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసుకునేందుకు సన్నాహాల్లో స్థానికులుంటే అది ఓర్వలేని స్థానిక నాయకులు కొందరు యువకులపై అక్రమ కేసులు పెడుతున్నారని విమర్శించారు. గ్రామంలో ప్రశాంత వాతావరణం ఏర్పాటుకు పోలీసులు సహకరించాలని కోరారు.

దేవిరెడ్డికి ఘన నివాళి



దేవిరెడ్డి విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ సర్పంచు తిక్కవరపు గోపాల్‌రెడ్డి, అబ్దుల్లా

విడవలూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): నిత్య పోరాటం యోధుడు, సీపీఐ నేత దేవిరెడ్డి పరమేశ్వరరెడ్డి 47వ వర్ధంతి సందర్భంగా ఆదివారం మండలంలోని ముదివర్తిలో ఆయన విగ్రహానికి మాజీ సర్పంచు తిక్కవరపు గోపాల్‌రెడ్డి, మాజీ కో ఆప్షన్ సభ్యుడు అబ్దుల్లాలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఐలో చురుగ్గా ఉండే పరమేశ్వరరెడ్డి ఎవరు సమస్యల్లో ఉన్నా వారికి అండగా ఉండేవారన్నారు. అయన చేసిన సేవలు అభినందనీయమన్నారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు.

బొందిలి కులాన్ని ఓబీసీలో చేర్చాలి

● బొందిలి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాససింగ్



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌సింగ్

నెల్లూరు (హరనాధపురం), జనవరి 19 (ఆంధ్రజ్యోతి): బొందిలి కులాన్ని కేంద్ర ప్రభుత్వం ఓబీసీ జాబితాలో చేర్చాలని బొందిలి సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్ శ్రీనివాస్ సింగ్ కోరారు. ఆదివారం నగరంలోని ఓ కల్యాణ మండపంలో బొందిలి సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ 2008లో అప్పటి ఉమ్మడి ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం బొందిలి కులస్తులను బీసీ-బీ కేటగిరిలో చేర్చిందన్నారు. నాటి నుంచి కేంద్రం లో కూడా ఓబీసీ కేటగిరిలో చేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని పలుమార్లు కోరామన్నారు. అయినా పట్టించుకోలేదని ఆరోపించారు. బొందిలి కులస్తుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర, జిల్లా కమిటీలను ఎన్నుకు న్నారు. జిల్లా కమిటీ అధ్యక్షుడిగా ఆర్ శ్రీనివాస్‌సింగ్, కార్యదర్శిగా ఏ నాగేంద్ర సింగ్, ట్రెజరర్‌గా చంద్రబాబు సింగ్, గౌరవాధ్యక్షుడిగా కోటిసింగ్, ఉపాధ్యక్షులుగా వై సాయిప్రసాద్‌సింగ్, వై శివ వాసుదేవ్‌సింగ్, ఆర్ నవీన్‌కుమార్ సింగ్, కార్యనిర్వాహక అధ్యక్షులుగా సురేష్ సింగ్, మల్లికార్జున్‌సింగ్, సంయుక్త కార్యదర్శిగా ఎస్ చంద్రపాల్ సింగ్, న్యాయ సలహాదా రుగా ఆర్ బాలేంద్ర సింగ్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బొందిలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణసింగ్, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేత కొమ్మలపూడి హెచ్‌సీసీ జట్టు



ఎస్ఐ శివరాకేష్ నుంచి కప్ అందుకుంటున్న కొమ్మలపూడి జటు

మనుబోలు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక క్రీడా మైదానంలో ఎన్ఎస్ఆర్ మెమోరియల్ కప్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా కొమ్మలపూడి హెచ్‌సీసీ (హనుమాన్ క్రికెట్ క్లబ్) జట్టు నిలిచింది. ఈనెల 11 నుంచి మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తుండగా 32 జట్లు పోటీ పడ్డాయి. ఆదివారం మనుబోలు ఎంజీసీటీ జట్టు, కొమ్మలపూడి హెచ్‌సీసీ జట్టులకు ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. టాస్ గెలిచిన ఎంజీటీసీ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన కొమ్మలపూడి జట్టు నిర్ణీత పది ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 88 పరుగులు చేసింది. తరువాత బ్యాటింగ్ చేసిన ఎంజీటీసీ జట్టు 7 వికెట్లు కోల్పోయి 54 పరుగులు మాత్రమే చేసింది. దీంతో కొమ్మలపూడి జట్టు విన్నర్‌గా నిలిచింది. విజేత జట్టుకు రూ.20వేల, ట్రోఫీని ట్రస్టు వ్యవస్థాపకుడు నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రతినిధులు షబ్బీర్, అంబటి శ్రీనివాసులురెడ్డి, ఎస్ఐ. శివరాకేష్ చేతులమీదుగా అందజేశారు. అలాగే రన్నర్ జట్టుకు రూ.15వేల, ట్రోఫీని అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాయపాటి కిరణ్‌కుమార్, దండు చంద్రశేఖర్ రెడ్డి, ముంగర విజయభాస్కర్‌రెడ్డి, రాజాగౌడ్, కలికి రమేష్‌రెడ్డి, జనసేన నేత పెనుబాక ప్రసాద్, కాంగ్రెస్ నేత బళ్లహరి తదితరులు పాల్గొన్నారు.

మదరసా 4వ వార్షికోత్సవం



విద్యార్థులకు ఖురాన్ గ్రంథం పంపిణీ చేస్తున్న ముస్లిం మత పెద్దలు

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం ఖాజానగర్‌లో ఆదివారం అల అమిన్ మదర్సాలో 4వ వార్షికోత్సవం ఇమామ్ అహమ్మద్ రజ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా అల్ హజ్ షేక్ బాషాసాహెబ్‌నూరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఖురాన్ అభ్యసించిన విద్యార్థులకు ఖురాన్ గ్రంథం బహూకరించారు, చిన్నారులకు ఉర్దూ పఠనం చేయించి 5పూటలా నమాజు చేసే విధంగా తీర్చి దిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఖాజానగర్ ముస్లింలు పాల్గొన్నారు.

'వాత్సల్య'లో వస్త్రాల పంపిణీ



విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న మైక్రోసాఫ్ట్ ఇంజనీర్ నందకిషోర్, డాక్టర్ శ్రీనివాసరాజు

నెల్లూరు (హరనాధపురం), జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వాత్సల్య అనాథ శరణాలయంలోని విద్యార్థులకు మైక్రోసాఫ్ట్ ఇంజనీర్ వీ నందకిషోర్ ఆదివారం నూతన వస్త్రాలను, మంకీ క్యాప్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గుండె వైద్య నిపుణుడు డాక్టర్ శ్రీనివాసరాజు, డాక్టర్ చేజర్ల రమాదేవి, డాక్టర్ చేజర్ల దివ్య, వాత్సల్య సంస్థ ఆర్గనైజింగ్ కార్యదర్శి జీవీ సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెమింగో ఫెస్టివల్‌పై కవి సమ్మేళనం



సమ్మేళనంలో కవులు

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 19 (ఆంధ్ర జ్యోతి): ఫ్లెమింగో ఫెస్టివల్ ప్రారంభం సందర్భంగా నగరంలో పెన్నా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కవి సమ్మేళనం జరిగింది. సం ఘం అధ్యక్షురాలు గోవిందరాజు సుభ్ర దాదేవి మాట్లాడుతూ సంక్రాంతి తర్వాత నెల్లూరు - తిరుపతి జిల్లాలకు రాష్ట్ర పండుగ ఫ్లెమింగో ఫెస్టివల్ అన్నారు. కవి సమ్మేళనంలో అవ్వారు శ్రీధర్‌బాబు, హస్తి లక్ష్మణ్‌రాజు, ఇనకోటి రవికు మార్, నాగేశ్వరమ్మ, మాధవ సుధ, కూని అంకబాబు, గండికోట సుధీర్, శేషమ్మ, లక్ష్మీ, ముక్తాల నరేంద్ర, సురేంద్రనాథ్, ఇసనాక దయాకర్‌రెడ్డి తదితరులు కవితలు వినిపించారు.

న్యూస్ బాక్స్

స్టేడియంలో 'శతమానం భవతి'

నెల్లూరు(విద్య), జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఆదివారం శతమానం భవతి కార్యక్రమం నిర్వహించారు. జనవరి నెలలో పుట్టిన వాకర్స్ జన్మదిన వేడుకలు జరిపి మిఠాయిలు పంచి పెట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన ఆరోగ్య సదస్సులో జీజీహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్, యూరాలజిస్ట్ డాక్టర్ జే జయరాజ్ మాట్లాడారు. 50 సంవత్సరాలు దాటిన పురుషులకు ప్రోస్టేట్ గ్రంధి వాపు వస్తుందని, దీని వల్ల మూత్ర విసర్జన సమయంలో ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కిలారి శ్రీనివాసులు నాయుడు, కార్యదర్శి గువ్వల నారాయణరెడ్డి, కోశాధికారి మాగంటి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేకు సహకరించాలి

తోటపల్లిగూడూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తోటపల్లిగూడూరు బిట్-2లో సోమవారం నుంచి జరుగుతున్న రీ సర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దారు ప్రసాద్ కోరారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డీటీ గణేష్, టీడీపీ నాయకులు మన్యం జితేంద్రగౌడ్, మధుసూదన్‌గౌడ్, మూగ రాజా, మండల రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రచార జాతాకు తరలిరండి

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఈనెల 20 నుంచి 24 వరకు నెల్లూరులో జరిగే సీపీఎం 27వ మహాసభలు, నెల్లూరు నుంచి బయలుదేరే ప్రచార జాతాను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి చల్లకొలుసు మల్లికార్జున ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే ఫిబ్రవరి 1,2,3 తేదీలలో నెల్లూరులో జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభలకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన పేర్కొన్నారు.

యోగి వేమనకు ఘన నివాళి



వేమన చిత్రపటానికి పూలమాలవేస్తున్న ఎంపీడీవో శైలేంద్రకుమార్

నెల్లూరు రూరల్, జనవరి 19 (ఆంధ్ర జ్యోతి) : పద్యాలతో సమాజంలోని మూఢ నమ్మకాలను పారద్రోలేందుకు, ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు కృషి చేసిన ప్రజాకవి యోగి వేమనకు నెల్లూరు రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నివాళి అర్పించారు. ఆయన జయంతి సందర్భంగా ఎంపీడీవో శైలేంద్రకుమార్ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేశారు. వేమన స్ఫూర్తిప్రదాత అని కొనియాడారు.

ప్రతి రక్తదాత రియల్ హీరో

● రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు

నెల్లూరు రూరల్, జనవరి 19 (ఆంధ్ర జ్యోతి): ఆపద సమయాల్లో మరొకరి ప్రాణాలు కాపాడేందుకు రక్తమిచ్చే దాతలు రియల్ హీరోలని నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు కొనియాడారు. ఆదివారం నెల్లూరు రూరల్లోని ధనలక్ష్మీపురం వద్ద హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రోడ్డు ప్రమాదాలు, ఇతర ఘటనల్లో అనేక మంది రక్తం కోల్పోయి, సమయానికి రక్తం అందక ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రక్తదానం ఎందరో ప్రాణాలు నిలబెడుతుందని చెప్పారు. రక్తదానంపై అపోహలు వీడి యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం ధనలక్ష్మీపురం కూడలి వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చిన హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ అధ్యక్షుడు కుంచాల విజయభాస్కర్‌ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ గుంజి వేణు, నోవీ బ్లడ్‌బ్యాంకు ఏవో మోపూరు భాస్కర్‌నాయుడు, నాగేశ్వరరావు, సొసైటీ సభ్యులు వినయ్, పవన్‌కుమార్‌రెడ్డి, రవి, కిరణ్ పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

● నారాయణ విద్యా సంస్థల జీఎం విజయభాస్కర్‌రెడ్డి



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న నారాయణ విద్యా సంస్థల జీఎం విజయభాస్కర్‌రెడ్డి

ఇందుకూరుపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): యువత క్రీడల్లో రాణించాలని నారాయణ విద్యా సంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పల్లెపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో నందమూరి బసవరామతారకం మెమోరియల్ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు జానా గిరిబాబు ఆధ్వర్యంలో జరిగిన 38వ క్రికెట్ టోర్నమెంటు పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి నారాయణ విద్యా సంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ 38 ఏళ్లగా బసవరామతారకం కమిటీ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంటు నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో 22 జట్లు పాల్గొనగా విజేతలుగా ఎన్ఎస్ఆర్‌సీసీ జట్టు నిలవగా, రన్నర్‌గా సెవెన్ హిల్స్ జట్టు నిలిచింది. ఈ కార్యక్రమంలో మునగాల రంగారావు, కోవూరు మధు, పొన్నెబోయిన చెంచుకిషోర్‌యాదవ్, మంచికంటి సుధాకర్, సుదర్శన్‌రెడ్డి, జానా నాగరాజు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

వెంకటాచలం, జనవరి 19 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని సర్వేపల్లిలోని కురువాడ సత్యానారాయణ జడ్పీ ఉన్నత పాఠశాలలో 2005-06 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం 19 ఏళ్ల తర్వాత ఆదివారం జరిగింది. అందరూ ఒక్కచోట కలుసుకొని ఒకరినొకరు యోగక్షేమా లను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. చదివిన బడి, పరిసరాలను చూసి భావోద్వే గానికి గురయ్యారు. నాడు గురువులు నేర్పిన క్రమశిక్షణ, చదు వుతో ఈరోజు వివిధ స్థాయిల్లో ఉన్నామని తెలిపారు. ఈసందర్భంగా తమకు పాఠాలు చెప్పిన నాటి హెచ్ఎం వెంకయ్య, ఉపాధ్యాయి నులు సుగుణ, ఇందిర, సుకన్య, పద్మావతి తదితరులు హాజరు కాగా వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకు న్నాయి.

నుడా చైర్మన్‌కు బాలయ్య శుభాకాంక్షలు



సాయినాథుడి మందిరంలో ఆశీర్వాదం తీసుకుంటున్న కోటంరెడ్డి దంపతులు

నెల్లూరు (వైద్యం), జనవరి 19 (ఆంధ్ర జ్యోతి): నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరు బాలకృష్ణ ఆదివారం ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలియచేశారు. రాజకీయంగా మరింత ఎదగాలని ఆకాంక్షించారు. కాగా, కోటంరెడ్డి పుట్టినరోజు సందర్భంగా నగరంలోని పలు డివిజన్లలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు చేశారు. బాలాజీనగర్ వరసిద్ది వినాయక దేవస్థానం వద్ద 13వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు తానే మస్తాన్ ఆధ్వర్యంలో 101 టెంకాయలు కొట్టారు. శ్రీనివాసులు నాయుడు, ఇనుకుల సుధాకర్‌బాబు, శ్రీనివాసులు, అఖిల్, నరేంద్ర, చందు తదితరులు పాల్గొన్నారు. అయితే కోటంరెడ్డి దంపతులు మాత్రం పుట్టిన రోజు వేడుకలకు దూరంగా ఉండి, బాలాజీనగర్ అద్దాల సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.



తడ మండలం భీములవారిపాలెం వద్ద..

సూళ్లూరుపేటలో స్టాళ్ల వద్ద జనసందడి

- పోటెత్తిన జనం
- పడవ షికారుకు ఉత్సాహం
- అర కొరగా బస్సులు
- నేలపట్టు లో ట్రాఫిక్ జామ్
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- భారీ వర్షంతో ఇక్కట్లు



పక్షుల పండుగ అదరహో!



'పులికాట్ సరస్సుకు పర్యావరణం అతి ముఖ్యమైన అంశం. పక్షులు పెద్ద ఎత్తున వస్తాయి. అదే సమయంలో అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఎన్నో దేశాల నుంచి వచ్చే పక్షులను కాపాడుకుంటేనే ఇలాంటి పండుగలు జరుపుకోగలం'

- కలెక్టర్ వెంకటేశ్వర్

సూళ్లూరుపేట/ తడ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పక్షుల పండుగ రెండవరోజు ఆదివారం అదరహో అనిపించింది.. సూళ్లూరుపేట కళాశాల మైదానప్రాంతాలు, నేలపట్టు పక్షుల రక్షితకేంద్రం, భీములవారిపాళెం పడవలరేవు,అటకానితిప్ప ప్రాంతాలకు జనం తండోపతండాలుగా తరలివచ్చారు. ఇక సూళ్లూరుపేట కాలేజీ మైదానంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను చూసేందుకు కూడా జనం పోటీపడ్డారు.ఉద్యానవనశాఖ, షార్ కేంద్రం ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో జనసందడి కన్పించింది. బీవీపాళెం పడవలరేవు, అటకానితిప్పల్లో ఏర్పాటు చేసిన వేదికల వద్ద నృత్య ప్రదర్శనలు పర్యాటకులను ఆకట్టుకున్నాయి. బంగారు చీరలో ఉన్న సూళ్లూరుపేట చెంగాళమ్మను దర్శించుకునేందుకు బారులుతీరారు.

వానతో అవస్థలు

శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు వాన కురిసింది. దీంతో కళాశాల మైదానంలో నీళ్లు నిలబడిపోయాయి. ఆ ప్రాంతం బురదగా మారడంతో నీళ్లను మోటార్లు పెట్టి బయటకు తోడేందుకు శ్రమించాల్సివచ్చింది. భీములవారిపాళెం పడవలరేవు వద్ద కూడా వానకు చిత్తడిగా మారిపోవడంతో అక్కడ సైతం జనం ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

జోరుగా హుషారుగా పడవ షికారు

భీములవారిపాళెం వద్ద ఏర్పాటు చేసినపడవ షికారుకు జనం ఎగబడ్డారు. వానజల్లు ఉన్నా ఉదయం నుంచే జనం పెద్ద ఎత్తున తరలివచ్చారు. భద్రత రీత్యా ఒక్కో పడవలో 10 మందికి మించి జనాన్ని ఎక్కించకపోవడంతో పడవ షికారుకు గంటపాటు ఎదురుచూసే పరిస్థితి నెలకొంది.

అర కొర బస్సులు

సూళ్లూరుపేట నుంచి నేలపట్టు, అటకానితిప్ప, భీములవారిపాళెం ప్రాంతాలకు బస్సులను నడపాలని కలెక్టర్ సూచించినప్పటికి కేవలం పది బస్సులతో సరిపెట్టేశారు.ఆదివారం సెలవు దినం కావడంతో వేల సంఖ్యలో విచ్చేసిన సందర్శకులు ఆటోలను ఆశ్రయించాల్సి వచ్చింది. అదీ తిరుపతి రవాణా అధికారి మురళీమోహన్ చొరవ తీసుకుని మధ్యాహ్నం 12.30గంటలకు ఈ బస్సులను జనాలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ లోపు ఆటోల్లోనే సందర్శకులు తిరగాల్సి వచ్చింది. అటకానితిప్ప, నేలపట్టులకు వెళ్లి వచ్చేందుకు ఒక్కొక్కరికి 100 రూపాయల చొప్పున ఆటోల్లో వసూలు చేశారు. బీవీపాళెంకు అయితే ఒక్కొక్కరికి 150 రూపాయలు వసూలు చేశారు.



సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న యాంకర్ అనసూయ

వచ్చే ఏడాది మరింత ఘనంగా పండుగ

- ప్రజాప్రతినిధులతో కలిసి కమిటీలు
- జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్



దొరవారిసత్రం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది కూడా ఇదే నెలలో ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహిస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. పక్షుల పండుగ నిర్వహణపై అనుభవం ఉన్న అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో మరింత ఘనంగా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఆదివారం నేలపట్టు పక్షుల కేంద్రంలో పర్యటించిన ఆయన తహసీల్దారు శైలాకుమారి, ఎఫ్ఆర్వో సౌజన్యలతో ఏర్పాట్లుపై చర్చించారు. తిరుమల ఘటనతో ఫ్లెమింగో ఫెస్టివల్ ఏర్పాట్లల్లో కొంత జాప్యం జరిగిందని, ఈ ఏడాది లోటుపాట్లను గుర్తించి, వచ్చే ఏడాదికి ముందుగానే సిద్ధం అవుతామని మీడియాకు వివరించారు. మూడు నెలలకు ముందే ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు.

నేలపట్టులో స్తంభించిన ట్రాఫిక్ రెండు గంటలు అవస్థలు

దొరవారిసత్రం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): నేలపట్టు పక్షుల కేంద్రంలో ట్రాఫిక్ అంతరాయంతో సందర్శకులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఆదివారం సెలవు దినం కావడంతో పెద్ద సంఖ్యలో కార్లలో వచ్చారు. దొరవారిసత్రం నుంచి పక్షుల కేంద్రం ప్రధాన గేటు వరకు మధ్యాహ్న సమయంలో రెండు గంటల పాటు వాహనాలు ఆగిపోయాయి. హైవే వంతెన, రైల్వే వంతెనల వద్ద వాహనాలు ఇరుక్కుపోయాయి. దాంతో నేలపట్టు ఆర్అండ్‌బీ రోడ్డుపై కూడా వాహనాలు బారులు తీరి కదలకుండా నిలబడిపోయాయి. పోలీసులు జోక్యం చేసికుని పరిస్థితిని చక్కదిద్దారు. సందర్శకులు పక్షులను చూశాక వాహనాలను మైలాంగం, నెల్లూరుపల్లి మార్గంలోకి మళ్ళించడంతో ట్రాఫిక్ తగ్గింది. ఇక్కడ పార్కింగ్ స్థలాలు కూడ సరిపోక ఇబ్బంది పడ్డారు.

గజ గజ

- పంటలను ధ్వంసం చేస్తున్న ఏనుగులు
- తాజాగా గజరాజుల దాడిలో మరణించిన ఉప సర్పంచ్
- ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకున్న రైతులు
- శాశ్వత రక్షణకు చర్యలేవీ?



ఏనుగుల దాడిలో దెబ్బతిన్న పంటలు (ఫైల్ ఫొటో)

చంద్రగిరి, జనవరి 19(జనవరి): చంద్రగిరి నియోజకవర్గంలో ఏనుగులు చెలరేగిపోతున్నాయి. తాజాగా శనివారం రాత్రి శేషాపురంలో వీటి బారిన పడి కందులవారిపల్లె ఉప సర్పంచి రాకేష్ చౌదరి(33) దుర్మరణం చెందారు. సాధారణంగా ఏనుగులు మామిడికాయల సీజన్‌లో (ఏప్రిల్, మే నెలల్లో) ఇక్కడి అటవీ సరిహద్దు ప్రాంతాల్లో సంచరించేవి. పంటలను ధ్వంసం చేసేవి. గత ఏడాది నవంబరు నెలాఖరులో చిత్తూరు జిల్లా పలమనేరు, కుప్పం ప్రాంతాల నుంచి 17 ఏనుగులు దామలచెరువు, పులిచెర్ల మండలాల మీదుగా చిన్నగొట్టిగల్లు మండలంలోకి చొరబడ్డాయి. నెల్లుట్లవారిపల్లె, భాకరాపేట పంచాయతీలోని ఎగువూరు, దిగువూరు గ్రామాల్లో పంటలను ధ్వంసం చేశాయి. సుమారు 70 ఎకరాల మామిడి, టమోటా, చెరకు పంటలను, కొబ్బరి చెట్లను నాశనం చేశాయి. దామలచెరువు పంచాయతీలోని మొరవపల్లె పదిపుట్లబైలు, ఈపాలగుట్టపల్లి, వల్లివేడు పరిసరాల్లో వరి, ఉద్యాన పంటలను ధ్వంసం చేశాయి. దీంతో రైతులు కొద్ది రోజులుగా రాత్రి వేళ పొలాల వైపు వెళ్లేందుకు భయపడుతున్నారు.

ఏనుగుల కట్టడికి రెండు మార్గాలు

ఏనుగుల సమస్యకు ట్రాంక్విలేజర్ (మత్తు ఇవ్వడం).. కుంకీ ఏనుగులను రప్పించడం పరిష్కార మార్గాలని అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. ఏనుగులు పంటలను ధ్వంసం చేసినా, సమీపంలో సంచరిస్తున్నా గుర్తించి అటవీ సిబ్బంది వాటికి మత్తు ఇంజెక్షను వేయాల్సి ఉంటుంది. మత్తులో ఉండగా వాటిని దూర ప్రాంతాలకు తరలించాలి. లేదా శిక్షణ పొందిన కుంకీ ఏనుగుల ద్వారా వాటిని మళ్లీ గమ్యస్థానానికి (పాత స్థావరాలు) చేర్చవచ్చంటున్నారు.

సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు ఎప్పుడు.?

శేషాచల అడవుల్లో నుంచి పొలాల్లోకి ఏనుగులు రాకుండా సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నా చర్యలు తీసుకోవడంలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ హయాంలో అప్పటి మంత్రి గల్లా అరుణకుమారి సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపారు. అదేసమయంలో రాష్ట్ర విభజన జరిగిన నేపథ్యంలో ఫెన్సింగ్ ప్రతిపాదన మరుగున పడింది. గత వైసీపీ ప్రభుత్వంలో కనీసం ఆ ప్రస్తావనే తేలేదు. కూటమి అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే నాని ఇటీవల అసెంబ్లీ సమావేశాలల్లో ఈ సమస్యను లేవనెత్తారు. ఇప్పటికైనా ఫెన్సింగ్ ఏర్పాటుకు కదలిక వస్తుందని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

నాలుగు రోజులుగా అలజడి

గడచిన నాలుగు రోజులుగా ఏనుగులు దేవరకొండ దాటి శేషాచల అడవుల్లోని అంకాలమ్మ గుడి, కల్యాణి డ్యామ్‌లకు చేరుకున్నాయి. డ్యామ్ మీదుగా రాత్రి పూట నారావారిపల్లె, శేషాపురం, భీమవరం అటవీ ప్రాంత సమీపంలోని పంటలను ధ్వంసం చేస్తున్నాయి. అటవీ అధికారులు వీటిని అడవిలోకి మళ్లించేందుకు విఫలయత్నం చేస్తున్నారు. గతంలో వేసవిలో తాగునీటి కోసం డ్యామ్‌కు వచ్చి, పంటలను ధ్వంసం చేసేవి. ఇప్పుడు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఏనుగులు గతంలో సంచరించిన ప్రాంతాన్ని గుర్తించలేక దారి తప్పి తిరుగుతున్నట్లు తెలిసింది. దీంతో ఈప్రాంత ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోయింది. మున్నెన్నడూ లేనివిధంగా చంద్రగిరి మండలంలో ఏనుగులు దాడిచేసి ఉపసర్పంచ్ రాకేష్‌ను పొట్టనబెట్టుకోవడంతో స్థానికులు హడలిపోతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సొంత మండలం కావడంతో ప్రభుత్వం వెంటనే స్పందించి గజరాజులను కట్టడి చేసి ఊరట కలిగించాలని కోరుతున్నారు.

శోకసంద్రంలో కందులవారిపల్లె

- ఉప సర్పంచి రాకేష్ చౌదరికి కన్నీటి వీడ్కోలు



పాడె మోస్తున్న ఎమ్మెల్యే నాని, మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు

చంద్రగిరి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఏనుగుల దాడిలో ఉప సర్పంచ్ రాకేష్‌చౌదరి మృతి చెందడంతో కందులవారిపల్లె పంచాయతీలో విషాదఛాయలు అలముకున్నాయి. ఈ ఘటన తెలిసిన వెంటనే సంఘటనా స్థలానికి శనివారం అర్ధరాత్రి ఎమ్మెల్యే పులివర్తి నాని, ఆయన తనయుడు వినీల్, శాప్ చైర్మన్ రవినాయుడు, టీడీపీ నాయకులు చేరుకున్నారు. చంద్రగిరి సీహెచ్‌సీలో పోస్టుమార్టం పూర్తయ్యాక ఆదివారం ఉదయం 10 గంటలకు రాకేష్‌చౌదరి భౌతికకాయాన్ని స్వగ్రామమైన మామిడిమానుగడ్డకు తరలించారు. అప్పటికే టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు అంత్యక్రియలు ఏర్పాట్లు చేశారు. నాని, రవినాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు పాడె మోశారు. భౌతికకాయంపై టీడీపీ జెండా కప్పి అంత్యక్రియలు నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాలర్స్ దివాకర్‌రెడ్డి, నాయకులు సుధారెడ్డి, వీరపల్లి హేమాంబరదరరావు, సుబ్రమణ్యంనాయుడు, ఈశ్వర్‌రెడ్డి, సింగు సుధా, గౌస్‌బాషా, బాలకృష్ణమూర్తి, కొండూరు ప్రవీణ్‌రాయల్ తదితరులు నివాళులర్పించారు.

పార్టీ అండగా ఉంటుంది: నాని

రాకేష్ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే నాని భరోసా ఇచ్చారు. టీడీపీ నుంచి రూ.5 లక్షల బీమా వస్తుందని టీడీపీ నాయకులు తెలిపారు. మంచి వ్యక్తిని కోల్పోయామని సినీ నటుడు నారారోహిత్ ట్వీట్ చేశారు.కాగా, అటవీ శాఖ అధికారులు తీసుకొచ్చిన రూ.10 లక్షల చెక్కును..విషాదంలో ఉన్న మృతుడి కుటుంబ సభ్యులు తిరస్కరించినట్లు తెలిసింది.

సీఎం చంద్రబాబు సంతాపం

అమరావతి, జనవరి19(ఆంధ్రజ్యోతి): కందులవారిపల్లె ఉప సర్పంచ్ రాకేష్‌చౌదరి ఏనుగుల దాడిలో మృతి చెందటంపై సీఎం చంద్రబాబు సంతాపాన్ని తెలియజేశారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే పసుపు సైనికుడి మృతి బాధాకరమని, పోరాటపటిమతో అనతి కాలంలోనే గుర్తింపు పొందిన రాకేష్ మరణం పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. రాకేష్ కుటుంబానికి అండగా ఉంటామని సీఎం భరోసా ఇచ్చారు.

14 ఏళ్లలో 37 మంది మృత్యువాత

ఎర్రావారిపాలెం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గడచిన 14 ఏళ్లలో 37 మంది ఏనుగుల దాడిలో ప్రాణాలు కోల్పోయారు. వీరిలో నలుగు మహిళలు ఉన్నారు. 2005లో ఎర్రావారిపాలెం మండలం మేదరపల్లెకు చెందిన రామిరెడ్డి, 2006లో తలకోనలో ఆరేటయ్య, కుప్పం మండలం ఊర్లఓబనపల్లెకు చెందిన గంగులప్పలను తొక్కి చంపేశాయి. 2009లో కుప్పం మండలం అలుగుమానుపల్లెకు చెందిన వెంకటేశ్వర్లు, 2012లో అత్తినత్తంకు చెందిన వెంకటప్ప, 2016లో రామ సముద్రం మండలానికి చెందిన వెంకట్రామయ్య, 2013లో ఎర్రావారిపాలెం మండలం కోటకాడపల్లెకు చెందిన గంగులయ్య, 2017లో వడినపల్లె వద్ద చిన్నబ్బ, 2018లో ఎర్రావారిపాలెం మండలం కోటకాడపల్లెకు చెందిన వెంకటరమణ, 2019లో పలమనేరు వద్ద ముగ్గురు ఏనుగు దాడుల్లో ప్రాణాలు విడిచారు. 2020లో పలమనేరు వద్ద మహిళా రైతు, కుప్పం-కర్నాటక సరిహద్దులో శివ, కుప్పం మండలం పత్తిచేనుకు చెందిన సోని, 2021లో కుప్పానికి చెందిన ఓ రైతు, పుత్తూరు వద్ద తూపాకుల చిన్నబ్బ, పెద్ద పంజాణికి చెందిన బంగారప్పలపై దాడి చేసి చంపేశాయి. 2022లో మొగిలి ఘాట్ వద్ద ఎలిఫెంట్ ట్రాకర్ చిన్నబ్బ, సదుం మండలం చెరుకువారిపల్లె పంచాయతీకి చెందిన ఎల్లప్ప, కుప్పం మండలం గుడుపల్లెకు చెందిన తిమ్మప్ప నాయుడు, పలమనేరు ఇందిరానగర్‌కు చెందిన సుబ్రమణ్యంతోపాటు మరొకరు ప్రాణాలు కోల్పోయారు. 2023లో పెద్దపంజాణి మండలం ముదిరెడ్డిపల్లె రైతు మార్కెండేయ, కుప్పం మండలం మల్లనూరుకు ఉష, శివలింగం, గుడిపాల మండలం రామాపురానికి చెందిన వెంకటేశు, సెల్వీ, కార్తిక్, వసంత, పులిచెర్ల మండలం ఎర్రపాపిరెడ్డిగారిపల్లెకు చెందిన మస్తాన్ ఏనుగుల దాడిలో ప్రాణాలు విడిచారు. గతేడాది చంద్రగిరి మండలం కాశిపెంట వద్ద తమిళనాడుకు చెందిన వేలును, రామకుప్పం పీఎం తాండాకు చెందిన కన్నా నాయక్, పీలేరు శివారులో రెడ్డెప్పరెడ్డి, రామకుప్పం మండలం పీకే తాండాకు చెందిన రెడ్యానాయిక్‌లో మృత్యువాత పడ్డారు. తాజాగా చంద్రగిరి మండలం మామిడి మాను గడ్డ వద్ద ఉపసర్పంచ్ రాకేష్ నాయుడును ఏనుగులు తొక్కి చంపాయి.



తీవ్రంగా గాయపడిన ఐశ్వర్య - చికిత్స పొందుతున్న సతీష్, కార్తికేయ

- ప్రమాదంపై సకాలంలో స్పందించని పోలీసులు.. రాని హైవే అంబులెన్సు
- ఆలస్యంగా ఆస్పత్రికి తరలింపు

గంటపాటు రక్తమోడుతూ..!

- ప్రమాద స్థలంలో ఇద్దరు పిల్లల దుర్మరణం
- చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి
- ఒకరి పరిస్థితి విషమం, ఇద్దరికి తీవ్ర గాయాలు
- మృతులు, క్షతగాత్రులది కోయంబత్తూరు



సంఘటన స్థలంలో మృతిచెందిన జీవన్, విశ్వ - ఆస్పత్రిలో మృతి చెందిన కలైవాణి

చంద్రగిరి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): గోల్డెన్ అవర్. ప్రమాదాలు జరిగినప్పుడు వీలైనంత త్వరగా ఆస్పత్రికి తీసుకెళ్లాలి. ఏ మాత్రం ఆలస్యం జరిగిన తీవ్రంగా గాయపడిన వారి ప్రాణాలు పోవచ్చు. కానీ, ఆదివారం సాయంత్రం చంద్రగిరి మండలం పనపాకం పంచాయతీ రవణప్పగారిపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే ఇద్దరు మృతిచెందగా.. మిగిలిన క్షతగాత్రులు గంటపాటు రక్తమోడుతూ విలవిలలాడుతూ గడపాల్సి వచ్చింది. హైవేపై గస్తీ తిరిగే పోలీసులు.. హైవే అంబులెన్సు సకాలంలో రాకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. తిరుమల శ్రీవారి దర్శనార్థం భార్య ఐశ్వర్య, కుమారులు జీవన్, విశ్వ, అత్త కలైవాణి, బావమరిది సతీష్‌తో కలిసి కోయంబత్తూరుకు చెందిన కార్తికేయ కారులో బయలుదేరారు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు రవణప్పగారిపల్లె వద్ద వీరి కారు లారీని ఢీకొంది. కారు ముందు భాగం నుజ్జు నుజ్జు కావడంతో ముందు సీట్లో ఉన్న జీవన్(10), విశ్వ(8) అక్కడిక్కడే మృతి చెందారు. మిగిలిన వారు తీవ్ర రక్త గాయాలతో అల్లాడుతున్నా హైవేలో నిత్యం గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు కానీ, కేవలం జాతీయ రహదారిలో జరిగే ప్రమాదాలకు మాత్రమే వచ్చే అంబులెన్స్ కానీ రాలేదు. ఇక, ఈ ప్రమాదంతో కిలోమీటర్ల కొద్దీ వాహనాల రాకపోకలు స్తంభించాయి. కూతవేటు దూరంలోనే టోల్ ప్లాజా ఉంది. గంట పాటూ క్షతగాత్రులకు సాయం అందలేదు. చివరకు స్థానికుల సమాచారంతో పాకాల నుంచి ఆరు గంటలకు 108 అంబులెన్స్ వచ్చింది. క్షతగాత్రులను తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి 8 గంటల ప్రాంతంలో కలైవాణి(45) మృతి చెందారు. కారు నడుపుతున్న కార్తికేయ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఐశ్వర్య, ఆమె సోదరుడు సతీష్‌కు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తీరంలో కోళ్ల పందేలు



కోట,జనవరి19(ఆంధ్రజ్యోతి): కోట మండలం ఉత్తమనెల్లూరు, దొరువుకట్ట సమీపంలో ఆదివారం కోడిపందేలు నిర్వహించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాతో పాటు తిరుపతి, తమిళనాడులోని గుమ్మిడిపూడి, సేలం ప్రాంతానికి చెందిన జూదరులు కోడిపందేలు ఆడారు. 1500 మందికిపైగా కోడి పందేలు ఆడేందుకు వచ్చారు.ఆయా ప్రాంతాలకు చెందిన జూదరులు ఈ పందెం కోళ్లపై రూ.లక్షల్లో బెట్టింగ్ కాశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పందేలు జరుగుతూనే ఉన్నాయి. ఈ కోడిపందేలపై పోలీసులు ఆలస్యంగా స్పందించి దాడులు జరిపారు. కోట, వాకాడు ఎస్ఐలు పవన్‌కుమార్, నాగబాబు ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించి 12 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి 10 కోళ్లు, రూ.10వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.


కబడ్డీ.. కబడ్డీ









నృత్యోత్సవం




అటవీ శాఖ స్టాల్ వద్ద జన సందడి



జాతరలా ఫ్లెమింగో ఫెస్టివల్


పోటెత్తిన జనం








సూళ్లూరుపేటలోని జూనియర్ కళాశాల వద్ద ఉత్సాహంగా ఆటలాడుతున్న విద్యార్థులు


సందర్శకులు



పక్షులతో పోటీపడి...

దొరవారిసత్రం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఫ్లెమింగో ఫెస్టివల్ రెండో రోజు నేలపట్టు సందర్శకుల రద్దీతో సందడిగా కనిపించింది. చెరువులోని కడపచెట్లమీద పక్షులతో పోటీపడి చెరువు కట్టమీద సందర్శకులు కిటకిటలాడారు. ఉదయం చిరు జల్లుల వల్ల జనం పలుచగా కనిపించినా 11 తర్వాత వెల్లువలా వచ్చారు. పక్షుల కేంద్రంలోని అన్నీ రోడ్లు జనంతో నిండిపోయాయి. సెలవురోజు కావడంతో చెన్నై నుంచి ఉద్యోగుల కుటుంబాలు పెద్ద సంఖ్యలో వచ్చాయి. అలాగే శ్రీసిటీ, మేనకూరు, మాంబట్టు సెజ్‌ల్లోని పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు కూడా భారీగానే వచ్చారు. నెల్లూరు, గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట, సత్యవేడు, వరదయ్యపాళెం, ఆరంబాకం, గుమ్మిడిపూడి ప్రాంతాల నుంచి సందర్శకులు అధిక సంఖ్యలో వచ్చారు. ఆదివారం ఒక్కరోజే దాదాపు 10 వేలమంది నేలపట్టును సందర్శించినట్టు అంచనా. పక్షుల వీక్షణ కోసం ఏర్పాటు చేసిన వ్యూ పాయింట్ వద్ద సందర్శకులను కంట్రోలు చేయడం కష్టంగా మారింది. చెరువు కట్టమీద ఉన్నవారిని పోలీసులు కట్టకింది మార్గం ద్వారా బయటకు పంపే ఏర్పాటు చేయడంతో ఒత్తిడి తగ్గింది. కేంద్రంలోని పక్షుల చిత్రాలు, ఫిల్మ్ షో సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఇక్కడ కొన్ని స్టాల్స్ ఏర్పాటు చేసివుంటే మరింత ఉపయోగకరంగా ఉండేది.

హైలెస్సో.. హైలెస్సా

వరదయ్యపాళెం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తడ మండలం భీములవారిపాలెం ఓడ రేవు నుంచి రెండో రోజూ సందర్శకులు పడవ షికారు చేశారు. 8 పాయింట్ల వద్ద 30 బోట్లను అందుబాటులో ఉంచినట్లు డీఎస్పీ చెంచుబాబు తెలిపారు. ఒక్కో బోటుకు పది మంది చొప్పున కేటాయించి వారికి సేఫ్టీ జాకెట్ ఇచ్చి షికారుకు తీసుకెళ్లారు. 1.55 కిలోమీటర్ల మేర పడవ షికారు చేశారు. ఆదివారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు అధికంగా వచ్చారు. నిప్పో పరిశ్రమ తరపున అన్నదానం నిర్వహించారు. తాగునీరు, వైద్య బృందాన్ని అందుబాటులో ఉంచారు. ఇక, కలెక్టర్ వెంకటేశ్వర్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కూడా బోటు షికారు చేశారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థులు ఎంతో మానసికోల్లాసంతో గడుపుతారన్నారు.

బోటు షికారుతో ఆనందం

నాలుగేళ్ల తర్వాత ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించడం సంతోషంగా ఉంది. ఈ సారి ప్రభుత్వం బోటు షికారు ఏర్పాటు చేసింది. పక్షుల పండుగ కార్యక్రమంలో పాల్గొని, మేమంతా బోటు షికారు చేయడం ఆనందాన్నిచ్చింది.

- నూర్జహాన్, నాయుడుపేట









సత్య మాస్టర్ నృత్య ప్రదర్శన - విద్యార్థుల నృత్య ప్రదర్శన - పాటలు పాడుతున్న గాయకులు శృతి, సావిత్రి, శ్రీనివాస్, బాల గాయకురాలు సాయి వాగ్దేవి,





సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తున్న ఎమ్మెల్యేలు విజయశ్రీ, రామకృష్ణ, సునీల్‌కుమార్, మాజీ ఎంపీ నెలవల, మాజీ మంత్రి పరసా - హాజరైన జనం

ఉర్రూతలూగించిన సాంస్కృతిక కార్యక్రమాలు

తడ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఫ్లెమింగ్ ఫెస్టివల్ భాగంగా ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు జనాలను ఉర్రూతలూగించాయి. ప్రముఖ నేపథ్య గాయకులు రఘు కుంచె, మంగ్లీ, బాల గాయకురాలు సాయి వాగ్దేవి, శ్రీనివాస్, శృతి, గాయత్రి ఆలపించిన పాటలు అలరించాయి. బిగ్‌బాస్ ఫేమ్ అష్యురెడ్డి, వేణు వ్యాఖ్యాతలుగా వ్యవహరించగా, సినీనటి అనసూయ భరద్వాజ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అలాగే సినీ కొరియో గ్రాఫర్ సత్యమాస్టర్ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కాగా, సాంస్కృతిక కార్యక్రమాలకు జనం పెద్దసంఖ్యలో రావడంతో కళాశాల మైదానం పూర్తిగా నిండిపోవడంతో చుట్టుపక్కల రోడ్లన్నీ జనసందోహంతో నిండిపోయాయి. ఓ దశలో తోపులాటలు జరిగాయి. పోలీసులు అప్రమత్తమై పరిస్థితి చక్కదిద్దారు. సూళ్లూరుపేట, వెంకటగిరి, గూడూరు ఎమ్మెల్యేలు నెలవల విజయశ్రీ, కురుగొండ రామకృష్ణ, పాశిం సునీల్‌కుమార్, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ మంత్రి పరసారత్నం, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణరెడ్డి, పెంచలకోన ఆలయ కమిటీ మాజీ చైర్మన్ తానంకి నానాజీ తదితరులు హాజరై కార్యక్రమాలను తిలకించారు.

క్రీడల పట్ల యువత మక్కువ పెంచుకోవాలి


విజేతలకు బహుమతులు అందచేస్తున్న నాగేశ్వరరావు

డక్కిలి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): క్రీడల పట్ల యువత మక్కువ పెంచుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వరరావు అన్నారు. డక్కిలి మండలం ఆల్తూరుపాడులో దివంగత నేత, మాజీ ఎంపీపీ పోలరెడ్డి వెంకటరెడ్డి జ్ఞాపకార్థం నిర్వహించిన క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. విన్నర్స్‌గా నిలిచిన ఆల్తూరుపాడు జట్టుకు రూ.25 వేలు, రన్నర్స్‌గా నిలిచిన రామాపురం జట్టుకు రూ.15 వేల నగదు బహుమతి, షీల్డ్‌లను అందజేశారు. అనంతరం నాగేశ్వరరావు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా వెంకటరెడ్డి జ్ఞాపకార్థం ఆయన మనవళ్లు శివశంకర్, జయశంకర్ క్రికెట్ పోటీలు నిర్వహించి యువతను ప్రోత్సహించడం అభినందనీమన్నారు. కార్యక్రమంలో డక్కిలి, వెంకటగిరి రూరల్ టీడీపీ అధ్యక్షులు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, పప్పు చంద్రమౌళి రెడ్డి, అంధుల స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పచ్చూరి పెంచల నరసయ్య నాయుడు, టీడీపీ నాయకులు రాజా, కుమార్ యాదవ్, ముద్దా మునిస్వామిరెడ్డి, వేముల నాగభూషణం నాయుడు, హరనాద్, చంద్రమౌళిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యోగి వేమనకు నివాళి


యోగివేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సింహపురిరెడ్డి సంక్షేమసంఘం ప్రతినిధులు

గూడూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం సింహపురిరెడ్డి సంక్షేమసంఘం ఆధ్వర్యంలో యోగి వేమన జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు జనార్దనరెడ్డి, రోహిణి మాట్లాడుతూ యోగి వేమన గొప్ప సంఘసంస్కర్త, ప్రజాకవి అని కొనియాడారు. ప్రజలను మంచి మార్గంలో నడిపించేందుకు వేమన అనేక పద్యాలను రచించి మానవాళికి మంచి చేశారన్నారు. కార్యక్రమంలో మధుసూదనరెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, దశరధరామిరెడ్డి, సనత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు మాని అభివృద్ధికి సహకరించండి

పెళ్లకూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అసత్య ఆరోపణలు మానుకుని అభివృద్ధికి సహకరించాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డికి ఆ పార్టీ నేతలు హితవుపలికారు. ఆదివారం శిరసనంబేడులో మాజీ ఉప సర్పంచు మల్లు కృష్ణయ్య, మరికొందరు టీడీపీ నాయకులతో కలిసి జరిగిన విలేకర్లతో మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా పార్టీ పటిష్టత కోసం శ్రమించిన తమకు ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం గ్రామాల్లో అభివృద్ధి పనులను ప్రజామోదంతో కేటాయించరన్నారు. ఇది మింగుడుపడిన వేలూరు మురళీకృష్ణారెడ్డి తనకు అనుకూలమైన వారికి పనులు అప్పగించలేదని ఎంపీడీవో ప్రమీలారాణిపై ఆరోపణలు చేయడం తగదన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ నాయకులతో కుమ్మకై సిద్దేశ్వరస్వామి కొండలను పిండి చేయడంతో పాటు ప్రభుత్వ భూములను ఆక్రమించి ప్లాట్లు వేసి విక్రయించిన మురళీకృష్ణారెడ్డి ఇతరులను విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో మౌలిక వసతులకు నోచుకోని గ్రామాల్లో కూటమి హయాంలో జరుగుతున్న పనులను అడ్డుకోకుండా అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శిరసనంబేటి సుందరరామిరెడ్డి, వేలూరు రమేష్‌రెడ్డి, గెడ్డం పోలిరెడ్డి, మల్లు ప్రసాద్ గుంటపూడి రమణయ్య, విజయ్‌కుమార్‌రెడ్డి, కాంద్ర రమణయ్య, తిరుమల, సుమన్ తదిరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

108 వాహనంలో ప్రసవం


పుట్టిన బిడ్డతో లలిత కుటుంబసభ్యులు, 108 సిబ్బంది కృష్ణ

చిల్లకూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏరూరు అల్లీపురం గ్రామానికి చెందిన లలిత ఆదివారం 108 వాహనంలో మగబిడ్డను ప్రసవించింది. లలితకు నొప్పులు రావడంతో గ్రామానికి సమీపంలోని చింతవరం పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ నుంచి 108 వాహనంలో గూడూరుకు తీసుకెళ్తుండగా మార్గం మధ్యలో నొప్పులు ఎక్కువ కావడంతో 108 సిబ్బంది కృష్ణ, ప్రభాకర్ పురుడు పోశారు. తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారు.

వామపక్షాల నిరసన

గూడూరు అర్బన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక టవర్‌క్లాక్ కేంద్రం వద్ద ఆదివారం వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించేలా మాట్లాడిన అమిత్‌షా వెంటనే దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు శశికుమార్, చంద్రయ్య, మస్తానయ్య, జమాలుల్లా, వెంకట్రామిరెడ్డి, సురేష్, ప్రసాద్, శివకుమార్ తదితులు పాల్గొన్నారు.

కోటమ్మకు ప్రత్యేక పూజలు



కోట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కోట గ్రామదేవత కోటమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారికి పలు అభిషే కాలు చేసి చందన, పుష్పాలంకరణలో ఉంచారు. కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, ఓజిలి మండలాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పాలక మండలి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ముత్యాలమ్మకు...

చిల్లకూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో వెలిసిన ముత్యాలమ్మకు ఆదివారం పూజలు జరిగాయి. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం ఆవరణలో పొంగళ్లు పెట్టుకుని ప్రత్యేక అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకుని నైవేద్యం నివేదించారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టుకుని మొక్కులు తీర్చు కున్నారు. అనంతరం భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నారాయణమ్మకు...

గూడూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక సొసైటీలో ఉన్న నారాయణమ్మ పెరంటాల ఆలయంలో ఆదివారం ప్రత్యేకపూజలు జరిగాయి. సంక్రాంతి తరువాత వచ్చే ఆదివారం అమ్మవారికి పూజలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించి, పూలంగిసేవ జరిపారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు. ఉభయదాతలుగా భోగనాధుల శోభన్ వ్యవహరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

దాడి చేసి సెల్‌ఫోన్, నగదు అపహరణ

గూడూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు సమీపంలో అదే గ్రామస్తుడిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి సెల్‌ఫోన్, నగదు లాక్కెళ్లిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ వివరాల మేరకు... మండలంలోని చెన్నూరు గ్రామానికి చెందిన మనోహర్ గూడూరులోని ఓ ప్రైవేటు కర్మాగారంలో పనిచేస్తుంటాడు. ఆదివారం వేకువజామున పనులు ముగించుకుని సైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా చెన్నూరు సమీపంలో ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు మోటారు సైకిల్‌పై వచ్చి మనోహన్‌ను అడ్డగించి దాడి చేశారు. అతని వద్ద నుంచి సెల్‌ఫోన్, రూ.70 నగదు లాక్కెళ్లారు. గాయపడిన మనోహర్‌ను ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

గూడూరు అర్బన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక సునీతసేవా సంస్థ కార్యాలయంలో ఈనెల 25వ తేదీ నుంచి మహిళలకు బ్యూటీషియన్ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నామని సంస్థ ప్రధాన కార్యదర్శి సారంగం సులక్ష్మి తెలిపారు. ఆసక్తి కలిగిన మహిళలు 9440455947 నంబరును సంప్రదించాలన్నారు.

బస్‌షెల్టర్ లేక ప్రయాణికుల ఇక్కట్లు


డివైడర్లపై కూర్చొని బస్సుల కోసం వేచివున్న ప్రయాణికులు

కోట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణ పరిధిలోని క్రాస్‌రోడ్డులో బస్ షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ ఉన్న బస్ షెల్టర్‌ను ఏడాదిన్నార క్రితం శిథిలావస్థకు చేరుకోవడం ఆర్అండ్‌బీ అధికారులు కూల్చివేశారు. కానీ కొత్త బస్‌షెల్టర్ నిర్మాణానికి చర్యలు చేపట్టలేదు. కోట, వాకాడు, చిట్టమూరు మండలాల ప్రయాణికులకు కూడలి ప్రాంతమైన క్రాస్‌రోడ్డులోని బస్ షెల్టర్ ఎంతో ఉపయోగకరం. అయితే ఇక్కడ బస్ షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు ఎండ, వానకు ఇబ్బందులు పడుతూ డివైడర్లపైనే కూర్చొని బస్సుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కోట క్రాస్‌రోడ్డులో బస్ షెల్టర్ నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

దుప్పట్ల పంపిణీ

చిల్లకూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటక్రాస్ రోడ్డు సమీపంలో ఉన్న నక్కలవారికండ్రిగ గిరిజన కాలనీవాసులు ఆదివారం బాషా, బషీరా సహకారంతో కృపసేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు శ్రీనివాసులు, గోపాల్, రమేష్, రమణయ్య, గువరయ్య, శంకరయ్య, చెంచయ్య, ఈశ్వరయ్య, సురేంద్రబాబు, మౌనిక తదితరులు పాల్గొన్నారు.